



సాధికార కమిటీకి సర్కార్ నివేదిక

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -40 శుక్రవారం 11 ఏప్రిల్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts



# యంగ్ ఇండియా నా బ్రాండ్..!

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శకుస్థాపనలో రేవంత్





**ఒక్కొక్కరిదీ ఒక్కో బ్రాండ్**

**సైనిక స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్**

**విద్యారంగాన్ని పటిష్టం చేయడమే లక్ష్యం**

హైదరాబాద్ ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ఒక్కొక్కరికి ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంటుందని...తన బ్రాండ్ యంగ్ ఇండియా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఇది ప్రతీ పోలీస్ సిబ్బందికి అత్యంత ముఖ్యమైనదని, ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆనాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీలకు పునాదులు పడ్డాయని, నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందన్నారు. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండి పోయారని అన్నారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని, ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతాది 2లో...

## ముంబై పేలుళ్ల నిందితుడు తహవ్వుర్ రాణా

# భారత్‌కు అప్పగింత..



**రాణాను భారత్‌కు రప్పించడంలో దయాన్ కృష్ణన్ కీలక పాత్ర**

**2010 నుంచి ముంబై దాడుల కేసును వాదిస్తున్న దయాన్ కృష్ణన్**

**దయాన్ వాదనలతో ఏకీభవిస్తూ రెండేళ్ల క్రితం అమెరికా కోర్టు తీర్పు**

**ఈ తీర్పును సమర్థించిన అమెరికా అత్యున్నత న్యాయస్థానం**

ముంబై ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ముంబై పేలుళ్ల ప్రధాన నిందితుడు తహవ్వుర్ రాణాను అమెరికా నుండి విజయవంతంగా భారత్‌కు తీసుకురావడంలో సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్ కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం దయాన్ కృష్ణన్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. అమెరికా న్యాయస్థానంలో భారత ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించి తహవ్వుర్‌ను మన దేశానికి రప్పించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. మిగతాది 2లో...

## హైదరాబాద్ సహా తెలంగాణలో

# చల్లబడిన వాతావరణం..

- మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయం
- క్యుములోనింబస్ ప్రభావంతో వర్షాలు పడుతున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడి



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. అనేక ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్ నగరంలో ఉదయం నుంచే వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం చిరుజల్లు కురిసింది. మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్, గాగిల్లాపూర్, ఎస్సార్ నగర్, పంజాగుట్ట, జుబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.


# కంచ భూములు తాకట్టు

**రుణం ఇప్పించిన మధ్యవర్తికి రూ.170కోట్ల లంచం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వంచెప్పిన లెక్క ఇది**

**ఈ భూములు అమ్మి రూ.40వేల కోట్లు తేవాలని సిఎం రేవంత్‌ప్రయత్నం**

**బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్‌రావు సంచలన ఆరోపణలు అంతకుముందు సుప్రీంకోర్టు ఎంపవర్ కమిటీకి నివేదిక అందజేసిన బిఆర్ఎస్ బృందం**

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ప్రభుత్వం నియమ నిబంధనలను ఉల్లంఘించిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు మండిపడ్డారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందు కు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక క మిటీ గురువారం హెచ్‌సియును సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో మా జీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రతినిధి బృందం కమిటీతో భేటీ అయింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను బిఆర్ఎస్ బృందం సుప్రీం కోర్టు పరిధిలోని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కి అందజేసింది. అనంతరం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కాలేరు వెంకటేష్,మిగతాది 2లో...



## తెలంగాణ పల్లెలకు చేరువగా ఇంటర్నెట్

**ప్రతి ఇంటికీ సాంకేతికత చేరాలన్నదే లక్ష్యం**

**-ఐటీశాఖ మంత్రిశ్రీధార్ బాబు వెల్లడి**



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఐటిశాఖ మంత్రిశ్రీధార్ బాబు అన్నారు. చివరి గ్రామం, చివరి ఇంటి వరకు ఫైబర్ కనెక్టివిటీ చేర్చే పనిలో ఉన్నామని చెప్పారు. పేద, మధ్యతరగతి, పెద్ద తరగతి ప్రజలందరికీ సమానంగా సేవలు అందించాలన్నదే మా ధ్యేయం అని అన్నారు. ఫింగర్‌టిప్‌లో సమాచారం ఉండేలా సాంకేతిక వనరులు అందిస్తున్నాం. ఇవన్నీ అతి తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం వచ్చే ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని అన్నారు.

## పోలీసుల అదుపులో బోధన్ మాజీ ఎంఎల్ఏ షకీల్



2లో.

## బడిబాట తరహాలో పిల్లలను గుర్తించాలి

**వారిని అంగన్ వాడీల్లో చేర్పించాలి**

**పిల్లలకు పోషకాహారం అందించేలా కృషి**

**అధికారులకు సూచించిన మంత్రి సీతక్క**



2లో.

# స్లాట్ బుకింగ్ గ్రాండ్ సక్సెస్

## రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాదఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):ప్రజలకు సులువుగా న్యాయమైన, వేగవంతమైన సేవలు అందించడ మే లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలోని 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి వ చ్చిందని, ఇక్కడ వచ్చే ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. రెవెన్యూ విభాగంలో ఏ సంస్కరణ చేపట్టినా, ఏవిధానపరమైన నిర్ణయం తీసుకున్నా ప్రజల కోణంలోనే ఉండాలని అధికారులకు ఆయన సూ చించారు. తొలిరోజు స్లాట్ బుకిం గ్ అమలు, ప్రజల నుంచి వస్తున్న స్పందనను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# గ్రామ గ్రామానికి విత్తనం



హైదరాబాద్ :ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో రైతులందరికి నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్షంగా గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం- అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంద ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు తెలిపారు. జూన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి చేతుల మీదుగా గ్రామ గ్రామానికి విత్తనం కా ర్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గు రువారం సచివాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ ఫెసర్ అల్దాస్ జానయ్య, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి తదికారులతో మంత్రి సమీక్ష స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గ్రామ గ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం అనే కా ర్యక్రమానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని, జూన్ మొదటి వారంలో సిఎం రేవంత్ రెడ్డి చేతు ల మీదుగా జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సహకారంతో సుమారు 40వేల మంది రైతులకు 2,500 నుండి 3,000 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి వివరించా రు.

## హైదరాబాద్ సహా తెలంగాణలో

# చల్లబడిన వాతావరణం..

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌తో సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర జిల్లాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## పోలీసుల అదుపులో బోధన్ మాజీ ఎంఎల్ఏ షకీల్

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):



బిఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎంఎల్ఏ షకీల్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నా రు. గతంలో ఆయనపై పలు కేసుల్లో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. కాగా గత కొన్ని రోజులుగా ఆయన దుబాయ్‌లో ఉంటు న్నారు. తల్లి అంత్యక్రియల కోసం గురువారం హైదరాబాద్ చేరుకున్న ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంత్యక్రియల్లో పాల్గొ నేందుకు అనుమతి ఇచ్చారు. వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న షకీల్ కేసులు నమోదు అయినప్పటి నుంచి దుబాయ్‌లో ఉంటున్నారు. తెలంగాణలో ప్రభు త్వం మారిన తర్వాత ఆయనపై చాలా కేసులు నమోదయ్యాయి. వాటిలో అరెస్టు తప్పదని గ్రహించి దుబాయ్ వెళ్లిపోయారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించిన షకీల్‌ను రప్పించలేకపోయారు. అయితే ఇంతలో అనారోగ్యంతో తల్లి మృతి చెందారు. షకీల్ రాక తప్పలేదు. వచ్చిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షకీల్ కుమారుడు కూడా హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షకీల్ కుమారుడు రాహిల్ ఆమిర్ 2022లో జూబ్లీహిల్ జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో శిశువు చనిపోయాడు. తర్వాత 2023 డిసెంబర్‌లో కూడా అలాంటి ప్రమాదం జరిగింది. ప్రజాభవన్ ముందు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీ కొట్టి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమో దు చేసి విచారిస్తే సంబంధం లేని వ్యక్తులను అందులో ఇరికించేందుకు యత్నించినట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి. కొందరు పోలీసులతో కుమ్మక్కై అతన్ని తప్పించారని విచారణలో తేలింది. హిట్ అండ్ రన్ కేసులో కుమారుడిని తప్పించడంలో షకీల్‌దే కీలక పాత్ర అని పోలీసులు అనుమానించారు. ఈ దిశగానే కేసును విచారించారు.

## ముంబై పేలుళ్ల నిందితుడు తహవ్వుర్ రాణా

# భారత్‌కు అప్పగింత..

(మొదటి పేజి తరువాయి)

ఢిల్లీ ప్రత్యేక కోర్టులో తహవ్వుర్‌పై జరగనున్న విచారణలో కూడా దయాన్ కృష్ణన్ ఎన్ఐఏ తరఫున వాదనలు వినిపించనున్నారు. సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్ దేశంలో పేరొందిన క్రిమినల్ లాయర్లలో ఒకరుగా ఉన్నారు. నేషనల్ లా స్కూల్ నుంచి 1993లో పట్టా పొందిన ఆయన 1999 నుంచి స్వతహాగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2001లో పార్లమెంటుపై ఉగ్రదాడి, కావేరీ జల వివాదం వంటి కేసుల్లో వాదించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2012లో సంచలనం సృష్టించిన నిర్భయ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా వ్యవహరించారు. 2010 నుంచి ఆయన ముంబై దాడి కేసును వాదిస్తున్నారు. హెడ్లీ, తహవ్వుర్ రాణాలను అమెరికా నుంచి భారత్‌కు అప్పగించే కేసులకు ఆయన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2014లో ఆయన ఈ కేసుల కోసం నియమితులయ్యారు. తహవ్వుర్ అప్పగింతకు సంబంధించి రెండేళ్ల క్రితం అమెరికా న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చాలా కీలకంగా మారింది. దయాన్ కృష్ణన్ చేసిన వాదనలతో ఏకీభవిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అప్పగింత విషయంలో ఈ కేసు ఒక కీలక మలుపు తిరిగింది. ఈ తీర్పును అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# స్లాట్ బుకింగ్ గ్రాండ్ సక్సెస్

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం తొలిరోజు గురువారం నాడు 626 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండారిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చి గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చొనే పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు, పారదర్శకతను తీసుకురావడానికి ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలో క్యూలైన్లకు గుడ్‌బై చెప్పే రోజులు వస్తాయని, దళారులు ప్రమేయం కూడా ఉండబోదన్నారు. ఈ స్లాట్ బుకింగ్ ద్వారా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తి అవుతుండడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్ సైట్ %తీవస్త్రఅర్‌తీఫ్‌ఆశీత్.వశ్రీఖఅస్త్రుఖఝ.స్త్రశీజ.ఱఅ% స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆ రోజు ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుకింగ్ ఉపయోగపడుతుందని అలాగే సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలు మెరుగైన సేవలు అందుతా యని ఆయన అన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయిమెంట్ తేదీ, సమయాన్ని కూడా ముందే తెలుసుకోవచ్చన్నారు. నిర్దేశిత తేదీ, సమయంలో ఎటువంటి హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల కొనుగోలుదారులు, అమ్మకం దారులు, సాక్షులు తగిన సమయంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరుకోవడానికి వీలు కలుగుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. పారదర్శకతతో మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుందని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణ పల్లెలకు చేరువగా ఇంటర్నెట్

(మొదటి పేజి తరువాయి)

ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా నడుస్తోంది. అక్కడ ప్రజలు ఎంతో హర్షిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటిలో స్మార్ట్ టీవీ ద్వారా టెలిఫోన్, కంప్యూటర్ సదుపాయాలు లభించేలా తయారు చేస్తున్నారని, ఇది విద్య, సమాచారం పరంగా ప్రజలకు చాలా ఉపయోగకరంగా మారనుందని వివరించారు. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 43,000 కిలోమీటర్ల ఫైబర్ నెట్‌వర్క్ ఏర్పాటు- చేస్తున్నాం. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్‌గా నిలవనుందని మంత్రి చెప్పారు. అంతేకాకుండా.. '2013లో ÷ఖఅ ప్రభుత్వం ఇ÷ూకర ద్వారా గ్రామాల్లో ఫైబర్ నెట్‌వర్క్ ఇవ్వాలని ప్రారంభించింది. రాష్ట్ర విభజన తరువాత గత ప్రభుత్వం దీన్ని కొనసాగించింది. ఇప్పుడు మేము దీనిని పూర్తిగా పూర్తి చేయబోతున్నాం. మా ప్రభుత్వానికి సంవత్సరం నాలుగు నెలలు పూర్తవుతున్న ఈ సమయంలో, మిగిలిన 40 శాతం పనులు పూర్తి చేశాం. మిగిలినవన్నీ సమయానుకూలంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

# యంగ్ ఇండియా నా బ్రాండ్..!

(మొదటి పేజి తరువాయి)

రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారని, హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్‌ను గుర్తుంచు కుంటారని, అలాగే ఇవాళ తాను క్రియేట్ చేసిన తన బ్రాండ్ 'యంగ్ ఇండియా' మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామని అన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్ అని, నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ-ని ఏర్పాటు- చేసుకున్నామన్నారు. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్‌గా నియమించుకున్నామని, ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉందని, దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమిని ఏర్పాటు- చేసుకోబోతున్నామని చెప్పారు. ప్రతీ నియోజక వర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందని అన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి... ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సైనిక్ స్కూల్‌కు ధీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చి దిద్దాలని.. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. పోలీస్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని.. సామాజిక బాధ్యతగా ప్రైవేటు- కంపెనీలు పోలీస్ స్కూల్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలని.. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు తీసుకున్న నిర్ణయాలే చరిత్రలో నిలిచి పోతాయి.. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా.. పీవీ సంస్కరణలు గుర్తించాల్సిందే.. అధికారులకు విజ్ఞప్తి.. మేము విధివిధానాలు సృష్టిస్తాం.. దాన్ని అమలు చేయాల్సింది మీరు.. నా బ్రాండ్ యంగ్ ఇండియా..అన్నారు. యంగ్ ఇండియా యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం.. ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది.. నా బ్రాండ్ యంగ్ ఇండియా అని తెలిపారు. సౌత్ కొరియా ఒక చిన్న స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ ఖ్యాతిని పెంచింది.. ఇంత పెద్ద దేశంలో ఒలంపిక్స్ లో చిన్న మెడల్ కూడా రాలేదు.. ఇంజనీరింగ్ పట్టా తీసుకుని పోతే.. తల్లిదండ్రులకు సంతోషం.. ఉద్యోగాల కోసం కంపెనీలకు పోతే.. అప్లికేషన్ కూడా నింపలేని పరిస్థితి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీనీ బెస్ట్ యూనివర్సిటీగా రూపొందిస్తాం.. రాజకీయ ఆలోచనలు చేయలేదు స్కిల్ యూనివర్సిటీలో.. సక్సెస్ ఉన్న కంపెనీలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీలో చేరిన వాళ్ళకి 100 శాతంఉద్యోగాలు వచ్చాయి.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ-లో కూడా పెద్ద కంపెనీలు పోటీ- పడుతున్నాయి.. పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ అత్యంత ముఖ్యమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 16నెలలైనా బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని నన్ను కొందరు అడుగుతున్నారు. యంగ్ ఇండియాలో చదువు, ఉపాధే నా బ్రాండ్. కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారు. దేశానికే దార్శనికుడు పీవీ నరసింహారావు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని స్థాపించాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. కేజీ టు- పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావు. యంగ్ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను సమకూర్చుకోవాలి. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో కనీస వసతులు లేవు.. ప్రతి నియోజక వర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం.. 25 ఎకరాల్లో స్కూల్.. ప్రతీ స్కూల్ కి 200 కోట్లు-.. విద్యా విధానంలో చిన్న గ్యాప్ ఉంది.. ప్రైవేటు- స్కూల్ లో విద్యార్థులు ఎక్కువ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యావంతులు.. కానీ ఇక్కడ చదివే పిల్లలు 18 లక్షల మందే చదువుతున్నారు.. నర్సరీ.. కూడా ప్రభుత్వ స్కూలులో ఏర్పాటు చేయాలని.. ప్లే స్కూల్ పెట్టాలని మా ఆలోచన.. త్వరలోనే అమలులోకి తెస్తాం.. సైనిక్ స్కూల్ తో మనం పోటీ- పడాలని అన్నారు. నేను ఉన్నంత కాలం మీకు నిధులు.. అనుమతులకు లోటు ఉండదని అన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, కమిషనర్ సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట తరహాలో పిల్లలను గుర్తించాలి

### వారిని అంగన్ వాడీల్లో చేర్పించాలి

### పిల్లలకు పోషకాహారం అందించేలా కృషి

### అధికారులకు సూచించిన మంత్రి సీతక్క

హైదరాబాద్ ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):



బడిబాట తరహాలో పిల్లలను గుర్తించి అంగన్‌వాడీల్లో చేర్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ప్రస్తుతం 30 కేంద్రాల్లో ఒక్క చిన్నారి కూడా లేకపోవడం, 198 కేంద్రాల్లో 5 మంది లోపే ఉండటం, 586 కేంద్రాల్లో 10 మంది లోపే ఉండటం ఆందోళన కలిగించే విషయం అని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ సచివాలయంలో సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర అధికారులు, జిల్లా సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. సీతక్క పేర్కొన్నట్టుగా, పోషకాహార తెలంగాణే మన లక్ష్యం. అందుకు అంగన్‌వాడీ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.. రాష్ట్రంలో 313 అంగన్‌వాడీ కేంద్రాలు ఇంకా తెరుచుకోకపోవడాన్ని తప్పుపడుతూ, చిన్నారులు లేరనే సాకుతో వ్యవస్థను నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. సిబ్బందిని ఉత్తేజపరిచేందుకు త్వరలో గ్రేడింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి తెలిపారు. మంచి గ్రేడింగ్ పొందిన సెంటర్ల సిబ్బందికి మరియు సంబంధిత జిల్లా అధికారులకు అవార్డులు అందిస్తామని చెప్పారు. అలాగే సరఫరా సామాగ్రిలో నాణ్యత లోపించినట్టయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరగాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి స్పష్టం చేశారు. కందిపప్పు కొనుగోళ్ల విషయంలో నిబంధనల ప్రకారం ఈ-టెండర్ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. పాత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో అప్పగించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని డిస్టిక్ ప్రొక్యుర్‌మెంట్ కమిటీ ద్వారా టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. సామ్, మామ్ ద్వారా బలహీన చిన్నారులను గుర్తించి నివేదికలు సమర్పించాలని, 50 శాతం కేసుల్లో అసలు రిపోర్ట్ చేయకపోవడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే బాల్యవివాహాలు, పిల్లల అమ్మకాలు, నిబంధనలకు వ్యతిరేకంగా జరిగే దత్తత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# కంచ భూములు తాకట్టు

(మొదటి పేజి తరువాయి)

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి హరీష్‌రావు మీడియా సమావే శం నిర్వహించారు. అన్ని ఆధారాలతో క్షేత్ర స్థా యి వాస్తవ పరిస్థితులతో సుప్రీం కోర్టు పరిధిలోని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీని కలిశామని తెలిపారు.



కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి కాం గ్రెస్ ప్రభుత్వం గతేడాది నవంబర్ 22న రూ.10 వేల కోట్లు రుణం తెచ్చిందని హరీష్‌రావు ఆరోపించారు. రుణం ఇప్పించడంలో మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తికి రూ. 169 కోట్ల 83 లక్షల అంటే సుమారుగా రూ.170 కోట్లు ఫీజుగా ఇప్పించారని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే లేవనెత్తానని, తాను అసెంబ్లీలో వేసిన ప్రశ్నకు.. రాతపూర్వకంగా ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానాన్నే చెబుతున్నారని అన్నారు. ఈ భూములను అమ్మి సిఎం రేవంత్ రెడ్డి 40 వేల కోట్లు తేవాలని ప్రయత్నం చేశారని చెప్పారు. ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించారు కదా.. దానిని అభివృద్ధి చేయండి అని, అక్కడ ఎలాంటి చెట్లు, వన్యప్రాణులు లేవు అని చెప్పానని పేర్కొన్నారు. సుప్రీ%శీ%కోర్టు ఆదేశాల ఉల్లంఘన జరుగుతుందని, ఎలాంటి చర్యలు, పనులు చేపట్టొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా బుధవారం సాయంత్రం టీజీఐఐసీ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఇది సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని, సిఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు అంటే కూడా భయం లేకుండా పోతున్నది అని ధ్వజమెత్తారు. కంచ భూముల విధ్వంసంలో పోలీస్ శాఖ పాత్ర కూడా ఉందని, గతంలో కొత్త సచివాలయం నిర్మించే సమయంలో చెట్లు నరకొద్దంటూ గ్రీన్ ట్రిబ్యునల్‌కి వెళ్లిన రేవంత్‌కు ఇన్ని చెట్లు నరకొద్దూ అని తెలియదా..? అని ప్రశ్నించారు. యూనివర్సిటీ భూములు తమకే చెందాలని విద్యార్థులు అడిగితే వారిపై కేసులు పెట్టారని మండిపడ్డారు.

### రైతుకు ఒక చట్టం.. రేవంత్ రెడ్డికి ఒక చట్టమా..?

రైతు ఒక్క చెట్టు కొడితే కేసు నమోదు చేస్తున్నారని, రైతుకు ఒక చట్టం.. రేవంత్ రెడ్డికి ఒక చట్టమా..? అని హరీష్‌రావు ప్రశ్నించారు. కంచె చేను మేసినట్లుగా ప్రభుత్వం వేలాది చెట్లు నరికివేసిందని, వైల్డ్ లైఫ్ యాక్ట్, వాల్టా యాక్ట్ ఉల్లంఘించి ప్రభుత్వం వ్యవహరించిందని అన్నారు. వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను నరకాల్సి ఉంటుందని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళన చేసినా అటవీ శాఖ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ స్పందించకపోవడంతోనే చెట్లు నరికేశారని,దాంతో జంతువులు చనిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ సెలవు దినాలు చూసుకుని మరి జేసీబీలతో చెట్లు నరికివేశారని మండిపడ్డారు. ఆ భూములు హెచ్‌సియుకే చెందాలని తాము కమిటీకి విన్నవించామని చెప్పారు. హెచ్‌సియు భూముల్లో చెట్ల నరికివేతతో సిఎం రేవంత్ రెడ్డి ఏడు చట్టాలను దుర్వినియోగం చేశారని హరీష్‌రావు పేర్కొన్నారు.

### జింకల మృతికి కారణమైన అధికారులపైన చర్యలేవీ..?

మూడు జింకలు చనిపోయాయి అని, వన్య ప్రాణుల గూడును చెదరగొట్టారని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. జింకల మృతికి కారణమైన అధికారులపైన చర్యలేవీ..? అని నిలదీశారు. పర్యావరణ విధ్వ%శీ%సం జరిగితే అటవీ అధికారులు నిద్ర పోతున్నారా..? అని ప్రశ్నించారు. ప్రైవేట్ భూమి అయినా అందులో చెట్లు పెరిగితే అందులో వన్య ప్రాణులు గూడు ఏర్పాటుచేసుకుంటే అది అటవీ భూమిగా పరిగణిస్తారని, 10 హెక్టార్ల కంటే ఎక్కువ భూమి ఉంటే.. అందులో చెట్లు ఉంటే అది అటవీ భూమిగానే పరిగణిస్తారని వివరించారు. 2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జిహెచ్ఎంసి లక్ష మొక్కలను నాటిందని, ఆ భూముల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయని చెప్పారు. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్నాయని తెలిపారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోందని అన్నారు. నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతివారూ నేరస్తులే అని, అందరూ కలిసే నేరం చేశారని హరీష్‌రావు ఆరోపించారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించండి.

## -బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధి చేయాలి-ఫుడ్ ప్రాసెసింగ్ తో పంట విలువ పెరుగుతుంది

## -రైతులకు చేయూతనందించాలి -సమీక్షలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు

సత్తుపల్లి/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలని, భవిష్యత్తు అంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగాని దేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు పేర్కొన్నారు. ఆహార ప్రాసెసింగ్ రంగంపై టి ఎస్ ఐ సి సీఈవో టి. మధుసూధన్, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్ లతో గురువారం
సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకల సౌకర్యాలకు బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ అనుకూలమన్నారు. అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి కంపెనీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి , అన్ని అవకాశాలు కల్పించాలన్నారు. రవాణా పరంగా బుగ్గపాడుకు ఉన్న వసతులు ఎక్కడా లేవన్నారు. ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే




ఉందన్నారు. అత్యధిక దిగుబడులు సాధించే రైతాంగం తెలంగాణకు ఉందన్నారు. విజయవాడ మచిలీపట్నం కోర్టుల కొద్ది సమీపంలో ఉందని వివరించారు.ఖమ్మం జిల్లాలో విరివిగా లభించే మామిడి, కొకో, ఆయిల్ పామ్, కొబ్బరి వంటి తోటల పంటల ప్రాసెసింగ్‌కు పార్క్ వసతులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అత్యధిక స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆయా పంటలను ఫుడ్ ప్రెస్సింగ్ చేసే అవకాశం కల్పిస్తే ఆయా పంటలకు విలువ పెరిగి రైతులకు సిరుల పంట కురుస్తుందన్నారు.

**వనరులు**

తెలంగాణలో ప్రధానంగా ఖమ్మం జిల్లాలో మామిడి కొబ్బరి ఆయిల్ ఫామ్ కోకో పంటలు విరివిగా పండించే రైతాంగం ఉందన్నారు. ఫుడ్ పార్క్ ను అభివృద్ధి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్, గ్రీన్ ఫీల్డ్ హైవే, విజయవాడ మరియు మచిలీపట్నం పోర్ట్‌కు సమీపంలో రవాణాలకు అనుకూలమైన ప్రదేశంలో ఉందని రవాణాకు లోటు లేదన్నారు.ముడి సరుకులు ఎక్కువగా అందుబాటులో ఉందని, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులను ఆకర్షించడంలో మెగా ఫుడ్ పార్క్ విఫలమవుతోందని తక్షణమే నిర్లక్ష్యం విడాలన్నారు. ధరలు ఎక్కువగా ఉండటం వలన పెట్టుబడిదారులను ఆకర్షించడంలో విఫలమవుతున్నట్టు మంత్రుల దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. ధరలను పునఃసమీక్ష చేసి, పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యూనిట్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# 17న జెఇఇ మెయిన్ ఫలితాలు




హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
దేశవ్యాప్తంగా జెఇఇ మెయిన్ రెండో విడత ఫలితాలను ఈ నెల 17న విడుదల కానున్నాయి. జెఇఇ మెయిన్ సెషన్ -2 పేపర్- 1 పరీక్షలు మంగళవారంతో ముగియగా, పేపర్- 2 పరీక్ష బుధవారంతో ముగిసింది. మొదటి సెషన్ ఫలితాలు ఫిబ్రవరిలో విడుదల కాగా, రెండో సెషన్ ఫలితాలు ఈ నెల 17న విడుదల కానుండగా,అదే రోజు నుంచి జెఇఇ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. జెఇఇ మెయిన్ రెండు సెషన్లలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) ఆలిండియయా ర్యాంకులను ప్రకటిస్తుంది.జెఇఇ మెయిన్‌లో కనీస మార్కులు సాధించిన 2.50 లక్షల మంది మే 18న జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం ఉంటుంది. జెఇఇ మెయిన్ ర్యాంకులతో ఎన్‌ఐటిలు, అడ్వాన్స్‌డ్ ర్యాంకులతో ఐఐటీల్లో సీట్లు పొందవచ్చు. దేశంలోని 31 ఎన్‌ఐటిల్లో గత ఏడాది సుమారు 24 వేలు, 23 ఐఐటీల్లో 17,600, ట్రిపుల్ ఐటీల్లో దాదాపు 8,500, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే విద్యాసంస్థల్లో 57 వేల సీట్లు ఉన్నాయి. ఒకవేళ విద్యార్థులు ఐఐటీల్లో చేరాలనుకుంటే మే 18న జరిగే జెఇఇ అడ్వాన్స్‌డ్ రాయాల్సి ఉంటుంది.

# వంట గ్యాస్ ధరలు తగ్గించాలి.



**అనంతగిరి:** ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
కేంద్రం ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని మహిళ సంఘం నాయకురాలు సుందరి సుజాత డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరలతో సతమతమవుతున్న పేదలపై సిలిండర్ ధర పెంపు మరింత భారంగా మారనున్నదన్నారు సామాన్య ప్రజలపై కేంద్రం భారం మోపడం సమాజసం కాదన్నారు కార్పొరేట్ సంస్థలకు వేలకోట్లు రాయితీలు ఇస్తూ పేద మహిళలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. గ్యాస్ ధర రూ, 50 పెంచి మా ఒంటరి మహిళలపై మోయలేని భారం మోపుతున్నారని చెప్పారు ధరల పెంపుతో పేద మధ్య తరగతి ఒంటరి మహిళలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం ఒంటరి మహిళలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించారని చెప్పారు. అదే తరుణంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధర వెంటనే తగ్గించి మధ్యతరగతి మహిళలపై పడుతున్న వంటగ్యాస్ ధర ఉపసంహరించుకోవాలని ఆమె కోరారు.

# రైతు కూలీగా మారి..

## ధాన్యాన్ని జల్లెడ పట్టిన మెదక్ జిల్లా కలెక్టర్



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొద్దిసేపు రైతు కూలీగా మారి అందరి దృష్టిని ఆకర్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జల్లెడ పట్టి తన ప్రత్యేకతను చాటుకున్నారు. అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి ఆయన మెదక్ మండలం పాతూరు గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా, కలెక్టర్‌తో పాటు వచ్చిన అధికారులు కేంద్రంలో కొద్దిసేపు వివిధ పనులు చేశారు. కలెక్టర్ స్వయంగా ధాన్యాన్ని జల్లెడ పట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కేంద్రాలలో ప్యాడీ క్లీనర్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యం విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా, గతంలో ఆయన ఔరంగాబాద్ గ్రామంలో వరి నాట్లు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు.

# రేవంత్ కు పౌరుషం లేదు...

# కేటీఆర్ ఓ బచ్చా: ధర్మపురి అర్వింద్



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవడం రేవంత్ వల్లే కాదు ఆయన బాస్ రాహుల్ గాంధీ వల్ల కూడా కాదని అన్నారు. తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనివ్వము అనేది అంత ఈజీ కాదని... తెలంగాణలో బీజేపీ రావడం అనేది తమ చేతుల్లో ఉందని చెప్పారు. కేటీఆర్ కు ఉన్నంత దమ్ము, ధైర్యం కూడా నీకు లేదని... నిన్ను జైల్లో వేసిన వారిని ఎందుకు జైలుకు పంపలేకపోతున్నావని రేవంత్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రేవంత్ కు రోషం, పౌరుషం లేదని అన్నారు. కేటీఆర్ ఓ బచ్చా అని... ఏం మాట్లాడతాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. హెచ్సీయూ భూములను కబ్జా చేసిన బీజేపీ ఎంపీ ఎవరో దమ్ముంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి అత్యంత ప్రమాదకారి అని... హైదరాబాద్ ను బేస్ మెంట్ తో సహా కూల్చివేయడం ఖాయమని అన్నారు.

# ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీ

## ప్రతి ఒక్కరూ దీనిని హర్షించాల్సిందే -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం దేశవ్యాప్తంగా మరెక్కడా లేని విధంగా విస్తృతంగా కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని పూర్తి పర్యవేక్షణతో నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచే గొప్ప కార్యక్రమం అన్నారు. మూడు కోట్ల మందికి ప్రతి నెలా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణే. దేశంలో ఎక్కడా ఇటు-వంటి పథకం అమలులో లేదని మంత్రి తెలిపారు. గతంలో సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం పేదలకు చేరకపోవడం వల్లనే ప్రభుత్వం సన్న బియ్యాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. అది మధ్యలోనే దారి మళ్లి, అసలు లబ్దిదారులకు చేరకుండా తేడా వచ్చింది. అందుకే ఈసారి సన్న బియ్యాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఈ పథకం విజయవంతం కావాలంటే, ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో పథకం అమలును దగ్గర నుండి పర్యవేక్షించాల్సిందే అని



మంత్రి స్పష్టం చేశారు. సన్న బియ్యం పేదలకు న్యాయంగా అందేలా చూసే బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిదని అన్నారు. ప్రతి ప్రజాప్రతినిధి, ఒక్కసారి అయినా సన్న బియ్యం తీసుకునే లబ్దిదారుల ఇంటిలో భోజనం చేయాలి. అప్పుడే వారు తినే అన్నం నాణ్యత ఎలా ఉందో తెలిసి వస్తుంది. ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం రేషన్ సరఫరాగా కాకుండా, ఆహార భద్రతకు సంకేతంగా తీసుకుంటోంది. అన్ని శాఖల సమన్వయంతో సన్న బియ్యం సరఫరాలో అక్రమాలు, లోపాలు లేకుండా చూడటం, అధికారుల కర్తవ్యం అని మంత్రి తెలిపారు. అంతేకాకుండా.. 'సన్నబియ్యం విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా తిప్పికొట్టాలి. గతంలో సంవత్సరానికి 24 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశాం. ఇప్పుడు
30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 49 వేల కార్డులే ఎక్కువ ఇచ్చారు. ఇప్పుడు 30 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. ప్రతీ అర్హునికి రేషన్ కార్డును అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# దాడి చేసిన పెద్ద కుమారుడు

## - మృతి చెందిన తల్లి రంగమ్మ

పర్వతగిరి/ఏప్రిల్ 10(జర్నలిస్ట్ వార్త): కన్న కొడుకే కన్న తల్లిని కడతేర్చాడు. కన్న పాపానికి కుమారుని చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఘటన పర్వతగిరి మండలం గుడి తండాలో చోటు చేసుకుంది. గురువారం ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన భూక్య రంగమ్మ (65) అనే మహిళని తన పెద్ద కుమారుడు దేవుడు రవిగా పిలువబడే భూక్య రవి చేతులతో, కాళ్లతో చాతి పై కొట్టడం వల్ల ఆ దెబ్బలకు గురువారం ఉదయం 6 గంటలకు అట్టి మహిళ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి చిన్న కుమారుడు రమేష్ ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**ఆ స్థాయిలో ఎవరినైనా ఊహించుకోవచ్చా?**

నవమాసాలు మోసి, ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని ఓ మనిషికి జన్మనివ్వాలంటే కన్నతల్లి మరో పునర్జన్మ ఎత్తాల్సిందే. అంతగా బాధించబడితేనే ప్రతి మనిషి పుట్టుక సాధ్యమౌతుంది. అలాంటి కన్నతల్లినే కడతేర్చాడు. మరికొన్ని ప్రాంతాల్లో పుట్టిన దగ్గరనుంచి రక్షణగా నిలబడి బ్రతికినంత కాలం అమూల్యమైన తన సేవలందించే కన్న తండ్రిని పొట్టన పెట్టుకుంటున్నారు. తల్లిదండ్రులను చంపేస్తున్నారు సరే.. కన్న తల్లిదండ్రులకు మించిన స్థానం ఇంకా ఎక్కడ ఉంటుంది? వారి స్థానంలో మరెవరినైనా ఇతరులను ఊహించుకునేందుకు అవకాశం ఉంటుందా? వారి స్థానంలో మరొకరిని ఊహించుకునే అవకాశం లేనప్పుడు, తల్లిదండ్రులను కడతేర్చే అవసరం ఏముంది? తల్లి తండ్రి గురువు దైవం అంటూ ప్రాథమిక స్థాయిలోనే ఉపాధ్యాయులు పాఠాలు నేర్పిస్తారు. అలాంటిది తల్లిదండ్రులను



పొట్టన పెట్టుకుంటున్నప్పుడు సభ్యత, సంస్కారం, సాంప్రదాయాలతో పనేముంది. అక్కడ ఇక్కడ తగాదాలు పెట్టుకుని ఇతరులపై దాడి చేయడం, జైలుకు వెళ్లి బెయిల్ పై మళ్ళీ తిరిగి రావడం. ఇలాగే అలవర్చుకున్నవారికి ఎలాంటి తారతమ్యం లేకుండా ఇరుగు పొరుగు వారితో పాటు సొంత వ్యక్తులను సైతం కడతేర్చడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ప్రభుత్వమే ఓ సరైన నిర్వచనం ఆచరణలోకి తీసుకురావాలి.

# తెలంగాణ పర్యాటక విధానం భేష్

## ఆతిథ్యరంగానికి పెరుగుతున్న ఆదరణ

ముంబై,ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానంతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఆతిథ్య రంగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ముంబయి పోవై లేక్‌లో జరిగిన దక్షిణాసియా 20వ హోటల్స్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ప్రఖ్యాత హోటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో మంత్రి జూపల్లి ప్రత్యేకంగా సమావేశమై తెలంగాణ ఆతిథ్య రంగంలో పెట్టు-బడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. పీపీపీ విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టు-బడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులకు తొలి గమ్యస్థానంగా తెలంగాణను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటు న్నామని మంత్రి తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో టెంపుల్, అడ్వెంచర్, ఎకో, హెరిటేజ్, మెడికల్, వెల్ నెస్ టూరిజాన్ని అభివృద్ధి చేసేలా నూతన పర్యాటక




విధానాన్ని రూపొందించామని వివరించారు. రాష్ట్రంలో 2030 నాటికి రూ. 15 వేల కోట్ల పెట్టు-బడుల సమీకరణ, 3 లక్షల ఉద్యోగాల కల్పన, రెట్టింపు వృద్ధి, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఆధారంగా తెలంగాణను దేశంలో మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలపాలనే ఆశయంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు .

# టీబీ వ్యాధిపై అపోహలు వద్దు

## -డాక్టర్ ఐ.రత్న మనోహర్



**తల్లాడ/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):** టీబీ వ్యాధిపై ఎవరు అపోహలు పెట్టుకోవద్దని డాక్టర్ ఐ.రత్న మనోహర్ అన్నారు. గురువారం తల్లాడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పినపాక పంచాయతీలో క్షయ వ్యాధి ప్రబలిన మహిళా మూర్తికి డాక్టర్ ఐ.రత్న మనోహర్ ఏడు రకాల నిత్యవసర న్యూట్రిషనల్ సరుకులను ఆరు నెలల పాటు అందించడానికి ముందుకు వచ్చి మొదటి నెల న్యూట్రిషన్ కిట్టును అందించారు ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ఎవరు అపోహలు పెట్టుకోవద్దని టీబీ పూర్తిగా తగ్గిపోయే జబ్బు అని టిబి వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటూ టీబీ రహిత సమాజం కై కృషి చేయాలని పిలుపునిచ్చారు అలాగే తల్లాడ మండలంలో ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు టీబీ వ్యాధికి సంబంధించిన మందులు పరీక్షలు పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ కళావతి, టీబీ చికిత్స సూపర్వైజర్ వై సురేష్, ల్యాబ్ సూపర్వైజర్ సంజీవ్ కుమార్, ఫార్మసిస్ట్ శ్రీను, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు

# పాము కాటు బాధితునికి శ్రీనివాస్ రెడ్డి చేయూత



**రాయపర్తి/ఏప్రిల్ 10జర్నలిస్ట్ వార్త):**మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన ల్యాదేళ్ళ నర్సయ్య ఇటీవల పాము కాటుకు గురై హన్మకొండలోని దుర్గం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నిరుపేద నర్సయ్య కుటుంబానికి గురువారం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతకుల రంగా రెడ్డి తో అందజేశారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్ పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి




**తల్లాడ/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):**
పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలనిప్రగతిశీల మహిళా సంఘం తల్లాడ మండల అధ్యక్షురాలు గొడ్ల పుల్లమ్మ అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం తల్లాడ మండలం అన్నారు గూడెంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్యాస్ బండతో నిరసన వ్యక్తిత్వం చేశారు.ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం తల్లాడ మండల అధ్యక్షురాలు గొడ్ల పుల్లమ్మ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేదలపై ధరలు పన్నులు పెంచి వాళ్ల వెన్ను విరుస్తున్నారని ప్రపంచవ్యాప్తంగా చమురు క్రూడాయిల్ రేట్లు తగ్గిన ఇక్కడ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ పెట్రోల్ వంట గ్యాస్ డీజిల్ ధరలు పెంచడం సిగ్గుచేటు అన్నారు. నిత్యవసర సరుకులు పై పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ భారం పడుతుందన్నారు వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని లేనియెడల ప్రజా ఉద్యమాల ద్వారా ఈ ప్రభుత్వం బుద్ధి చెబుతామన్నారు ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు బసవమ్మ సత్యవతి శ్రీదేవి లక్ష్మి పద్మ శ్రీను లాల్మియా తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## -మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి.




**రాయపర్తి/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని,ప్రభ్యుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు.గురువారం మండలంలోని తిరుమలాయపల్లి,గన్నారం, కొండూరు, జింకు రాం తండ,కాట్రపల్లి,కిస్టాపురం, మొరిపిరాల,మైలారం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్,మండల వ్యవసాయధికారి వీరభద్రం,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల సెల్ అధ్యక్షుడు గుగులోత్ శ్రీనివాస్,దేవస్థాన డైరెక్టర్ పెండ్లి మహేందర్ రెడ్డి,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న,రెంటాల గోవర్ధన్ రెడ్డి,ఎండీ నయీమ్,మహిళామండల నాయకులు రత్నాకర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి,వనజ రాణి,పాల్వంచ కోటేశ్వర్,ఖాజామియా,ఐరెడ్డి ఎల్లారెడ్డి, లెతాకుల యాదవ రెడ్డి,మద్దెల వెంకటేష్,గ్రామ పార్టీ అధ్యక్షులు నరోత్తమ్ రెడ్డి, చిట్టే ఎల్లేష్, గుగు లోత్ సర్వన్, కుక్క ల రాములు,రామ్ చందర్ రెడ్డి,గజవెల్లి శేఖర్, జనగాం యాకయ్య, జినుగు సోమిరెడ్డి,సూధుల నిఖిల్, వశపాక ల్లయ్య, బండి రమేష్, పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు పంపిణీ



**సత్తుపల్లి/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):**
సీతా రాముల కళ్యాణం సందర్భంగా ఆర్ టీ సి వారు ప్రవేశపెట్టిన తలంబ్రాల పంపిణీ పథకం కింద భద్రాచలం సీత రాముల ముత్యాల తలంబ్రాలు కార్గో ద్వారా సత్తుపల్లి డిపో లో బుకింగ్ చేసుకున్నవారికి గురువారము సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ అందజేశారు. కార్గో ద్వారా రూ 151 కి ఇంటి వద్దకే సీతారాముల కళ్యాణం ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కే మునిర్ భాషా, విబిఓ ఆనందరావు, ఏ డీసి లు, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన జక్కంపూడి కిషోర్ ,రామ్ అప్పారావు,



**తల్లాడ/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం,బిల్లుపాడు లో ,బత్తుల కృష్ణ , కుమార్తె ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి గురువారం జక్కంపూడి కిషోర్ ,రామ్ అప్పారావు, హాజరై వధువు వరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారి వెంట సామినేని రామ్ అప్పారావు, జక్కంపూడి రమేష్, బత్తుల రాందాసు, బేగ్ నాగుల్ మీరా , జక్కంపూడి అభిమానులు గ్రామ పెద్దలు , గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికే పొలం బాట

## - వర్ధన్నపేట ఏడిఈ నటరాజ్.




**రాయపర్తి/ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):** రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పొలం బాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని వర్ధన్నపేట ఏడిఈ నటరాజ్ అన్నారు. గురువారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించి రైతుల సమస్యలను అడిగి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్ లోడ్ ట్రాన్స్ ఫార్మర్ లు తమ దృష్టికి తీసుకు వస్తే అతి త్వరలో ట్రాన్స్ ఫార్మర్ లను మారుస్తామని అన్నారు.ఎండాకాలంలో గాలి దుమరాలకు లైన్లు, విద్యుత్ స్తంభాలు కూలీ పోవడం జరుగొచ్చని రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.అలాంటి సంఘటనలు సంభవిస్తే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. మోటర్ల దగ్గర కెపాసిటర్ పెట్టుకోవాలని వివరించారు.రైతులు విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలారం సబ్ ఇంజనీర్ ముజాఫర్, కాట్రపల్లి ఇంచార్జి లైన్మెన్ బానోత్ శ్రీను, అన్వర్,సునీల్,రైతులు కుమార్,కాజామియా,యాకు, కొమురయ్య,శీను, రఫీ,రియాజ్, అఫ్జల్, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 12న వైన్స్ బంద్

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
%హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వైన్స్‌ను బంద్ చేయాలని పోలీస్ కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 6గంటల వరకు కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, వైన్స్ షాపులను మూసివేయాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లకు దీని నుంచి మినహాయింపు ఉంది. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించి షాపులను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పిడుగుపాటుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వర్షం బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కూడా కురిసింది. అయితే భారీ వర్షం ధాటికి పలు ప్రాంతాల్లో పిడుగులు కూడా పడ్డాయి. రెండు వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడటంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సంగారెడ్డి జిల్లాలో ఓ కళాశాల విద్యార్థి పిడుగుపాటుకు మరణించాడు. కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన సంతోష్ కాలేజీకి వెళ్లి వస్తుండగా.. భారీ వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లాడు. చెట్టు కింద ఉన్న సమయంలో పిడుగుపడి సంతోష్ మృతి చెందాడు. మరోవైపు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆములూరులో చిన్న రాములు అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. పొలంలో గొర్రెలు కాస్తుండగా.. పిడుగుపడటంతో రాములు మరణించాడు.

# మరో మూడ్రోజుల పాటు ఉరుములతో వర్షం

## హైదరాబాద్‌లోపలు చోట్ల ఈదురుగాలుల వర్షం -అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి సూచన



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. సాయంత్రానికి వర్షం మొదలైంది రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో గురువారం మధ్యాహ్నం నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. ఉక్కపోత నుంచి నగర ప్రజలకు ఉపశమనం కలిగింది. వారం రోజుల క్రితం వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అయ్యాయి. మళ్లీ ఇవాళ కాస్త ఎండలు నెమ్మదించాయి. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు- ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. ఇదిలావుంటే రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబా బాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వడగళ్ల వాన కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. ఈ గాలి దుమారానికి పలు ప్రాంతాల్లోని భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ హెచ్చరించింది. అలాగే భారీ వర్షాలు, ఈదురుగాలులు నేపథ్యంలో మాన్‌సూన్, డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు- వివరించింది. విపత్కర పరిస్థితులు ఎదురైతే.. వెంటనే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 040-2111-1111కు కాల్ చేయాలని నగర వాసులకు సూచించింది. ఆఫీసులు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే వాహనదారులు చాలా జాగ్రత్తతో వెళ్లాలని అప్రమత్తం చేసింది. అలాగే కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలువ వద్దని ప్రజలకు తెలిపింది. ఐటీ- కారిడార్‌లోని ఉద్యోగాలు ఒకే సారి రోడ్లపైకి రావొద్దని నగర ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఓ వేళ మీరు వెళ్లే రహదారుల్లో భారీగా ట్రాఫిక్ ఉంటే.. 100కు కాల్ చేసి.. మీరు ఏ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నారో చెబితే.. ఆ పీఎస్ పరిధిలోని పోలీసులు నిమిషాల్లో అక్కడి చేరుకొని.. ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తారని ట్రాఫిక్ విభాగం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

# దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉంది:రఘునందన్ రావు



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్ నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బీజేపీ నేత, మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూముల అంశంలో దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని కేటీఆర్, హరీశ్ రావునుద్దేశించి అన్నారు. బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూములను అడ్డగోలుగా అమ్మేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఇప్పుడు ప్రశ్నిస్తున్న కేటీఆర్, హరీశ్ రావు ఎక్కడకు పోయారని నిలదీశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములపై ఎందుకు సమీక్ష చేయలేదో చెప్పాలన్నారు. హెచ్‌సీయూ రికార్డుల్లోకి ఎందుకు ఎక్కించలేదని నిలదీశారు.ఇప్పుడు మాత్రం బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. విశ్వ విద్యాలయ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలని తాము కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశామని, ఇంచు భూమి పోకుండా విద్యార్థుల తరపున పోరాడుతామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం పై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన పర్యావరణ, కేంద్ర అటవీశాఖల సాధికారిక కమిటీతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని భూములను బిజెపి నేతలు గురువారం పరిశీలించారు. అనంతరం కేంద్ర కమిటీతో తెలంగాణ బీజేపీ నేతలు భేటీ అయ్యారు.

# కాంగ్రెస్ కులరాజకీయం ప్రమాదం!

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): కులరహిత సమాజాం కావాలని ఎలుగెత్తుతున్న వారికి..రాహుల్ లేదా కాంగ్రెస్ తీర్మానాలు చెంపపెట్టు లాంటివి. దేశంలో కులగణన అవసరమా లేదా అన్నది వీరు చెప్పాలి. ముఖ్యంగా లెఫ్ట్ పార్టీలు ఈ విషయంలో తమ అభిప్రాయం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. కులాలతో సమాజాన్ని చీల్చడం అవసరమా అన్నది తేల్చాలి. రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంక్ కోసం చేసే దుర్మార్గపు ఎత్తులను అందురూ ఓ కన్నేసి నిలదీయాలి. అహ్మదాబాద్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మరోమారు కులగణనకు ప్రాముఖ్యతను ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రం కులగణన చేసి అద్భుతం చేసిందని రాహుల్ అన్నారు. ఇలా దేశమంతా కుల గణన చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. తెలంగాణలో చేశారు. ఏం సాధించారన్నదానికి సమాధానం లేదు. వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదని రాహుల్ కన్నీరు ఒలకబోసారు. ముందుగా కాంగ్రెస్ నుంచే సంస్కరణలు రావాలి. తమ కుటుంబం నుంచి ముగ్గురు ఎంపిలు ఉన్నారు. సోనియా, రాహుల్, ప్రియాంకల్లో ఒకరుమాత్రమే ఎంపిలుగా ఉండి, మిగతా రెండి ఆదివాసీ లేదా దళితులకు కేటాయించి ఆదర్శం చాటాలి. అప్పుడే వారి మాటలకు అర్థం ఉంటుంది. కేవలం దమ్మీగా మల్లికార్జున ఖర్గేను కూర్చోబెడితే సరిపోదు. కులగణన, కటుంబ పాలన పోతే తప్ప ఈ దేశం బాగుడపదు. ప్రధాని మోదీ మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విభజించాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి కూడా స్థాయికి మించి విమర్శలు చేశారు. మతాల మధ్య బ్రిటిషర్లు




చిచ్చు పెడితే దానిని కొనసాగించిందే కాంగ్రెస్ పార్టీ. ఈ విషయం చరిత్ర చూస్తే తెలుస్తుంది. మోడీ కులగణన వద్దనే అంటున్నారు. సమాజాన్ని చీల్చవద్దని అంటున్నారు. చీల్చాలని చూస్తున్న కాంగ్రెస్ మోడీని ఎలా విమర్శిస్తుందన్నది సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలి. గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ గాడ్సే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో కూడా బలం లేదు. కేవలం రాహుల్ మెప్పుకోసం సిఎం రేవంత్ తంటాలు పడుతున్నారు. కులగణనపై తెలంగాణలో విమర్శలు వచ్చాయి. అసమగ్రంగా ఉందని అన్నారు. ముస్లింలను బిసిల్లో చేర్చడంపై బిజెపి విమర్శిస్తోంది. దీనికి సమాధానం లేదు. దేశ యువత ఏకం కావాల్సిన సమయం వచ్చిందంటున్న వారు...కులాలతో విభజించిన తరవాత ఇక ఎలా ఏకమవుతారో కాంగ్రెస్ పెద్దలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజల్లో ఐక్యత లేకుండా కులాల కుంపట్లు రాజేయడం ద్వారా రాజకీయ చలి కాచుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. ఈ ఉచ్చులో ప్రజలు పడకపోవడమే మంచిది. ఇప్పుడిప్పుడే విదేశాల్లో అవకాశాలతో అమెరికా,తదితరదేశాల్లో ఉద్యోగాలు పొందిన యువత, కులాల కుంపట్లకు దూరంగా ఉన్నారు. దేశాన్ని విభజించడమే మోదీ లక్ష్యం అంటున్న రేవంత్ రెడ్డి..దేశాన్ని ఎవరు ఎప్పుడు ఎలా విభజించారో..దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో గుర్తిస్తే మంచింది. తెలంగాణలో బీజేపీని, మోదీని అడుగు పెట్టనివ్వం అని అంటున్న రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తలబొప్పి కట్టిన విషయం మరచి పోయినట్లు ఉన్నారు. రాజకీయాల్లో హుందాగా మాట్లాడడం అవసరం అని గుర్తిస్తే మంచిది. ఇకపోతే కాంగ్రెస్ సమావేశం ప్రధానంగా కులగణన చుట్టే తిరిగింది. కులగణన ద్వారా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశమంతా కలుగణన జరగాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పి , ఆయన దేశంలో విభజనకు బీజం వేస్తున్నారు. ఆయా వర్గాలకు వారి హక్కులు లభించాలంటే ఎవరు ఎంతమంది ఉన్నారన్న లెక్క తేలాల్సి ఉందన్న భాష్యం చెప్పారు. ప్రైవేట్ సంస్థల్లో దళితులు, ఆదివాసీలు, ఇతర వెనకబడిన వర్గాలకు వారి వాటా దక్కడం లేదని వాపోయారు. ఆదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగుల జాబితా తీయాలన్నారు. తరచూ అమెరికా వెళుతున్న రాహుల్ అక్కడకి వెళ్లి భారత్ నుంచి ఎంపిక చేసుకునే వారిని కులాల వారీగా ఎంచుకోవాలని చెబితే బాగుంటుంది. ఆయా కంపెనీలత సిఇవోలతో సమావేశాలు పెట్టి ఇలాంటి డిమాండ్ చేయాలి. అంతెందుకు వారసత్వ పార్టీకి నాయకుడుగా ఉన్న రాహుల్ తమ కుటుంబానికి ఉన్న మూడు ఎంపి సీట్లు త్యాగం చేసి పోరాడితే బాగుంటుంది. కానీ ఆ పని మాత్రం చేయరు. ఇకపోతే రాజ్యాంగమే కాంగ్రెస్ ఆత్మ అని, దానిని పరిరక్షించు కునేందుకు మనమంతా కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. నిజానికి రాజ్యాంగానికి వచ్చిన ప్రమాద మేమిటో చెప్పలేదు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నమ్మడానికి దేశ ప్రజలు సిద్దంగా లేరు. దేశంలో కాంగ్రెస్ ఏలుబడిలో మెజార్టీ హిందువులు ఎలా ఊచకోతకు గురయ్యారో మననం చేసుకోవాలి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ పాలనలో మతకల్లోలాల్లో ఎంతమంది అమాయకులు బలయ్యారో గుర్తు చేసుకోవాలి. 370 ఉక్కు చట్రంలో కాశ్మీర్లో మెజార్టీ హిందువుల ఊచకోత ఎలా జరిగిందో చెప్పాలి. కాంగ్రెస్ ఐడియాలజీ రాజ్యాంగమని.. అందుకే బీజేపీ ధ్వంసం చేస్తోందని ఆరోపించినంత మాత్రాన కాంగ్రెస్ అరాచకాలు దాచితే దాగే సత్యాలు కావు. ఆధునిక సమాజంలో ఎవరికి వారు తమ కులవృత్తులను వదిలేశారు. తమకోసం అవసరమైన వృత్తులను ఎంచుకున్నారు. అలా వారు ప్రపంచంతో కలసి నడుస్తున్నారు. కులాల కుంపట్లకు దూరంగా ఉండాలని దేశంకోరుకుంటుంటే రాహుల్ కులాల కుంపట్లు పెట్టి రాజకీయ లబ్దికోసం పోరాడుతున్నారు. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. దాంతో ఏం చేస్తారు. ఎస్సీ,ఎస్టీ, బిసిల్లో కొందరు ఇప్పుడు రాజకీయంగా,ఆర్థికంగా ఎదిగారు. వారిని ఫలాన కులం అని చెప్పగలమా అన్నది ఆలోచన చేయాలి. దళితులను. ఆదివాసీలను వారి కులాల పేరుతో ఆధునిక సమాజానికి దూరం చేయరాదు. ప్రజల్లో ఐక్యతకు మాత్రమే మనమంతా పనిచేయాలని గుర్తిస్తే మంచిది.

# ట్రంప్ సుంకాలకు అనుగుణంగా వ్యూహాలు

## వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతులు పెంచాలి

న్యూఢిల్లీ,ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ట్రంప్ సుంకాలు విధిస్తున్న తరుణంలో మనం కూడా జాగ్రత్తగా ఉండాలి. మన ఎగుమతులకు డిమాండ్ పెంచుకోవాలి. ట్రంప్ సుంకాలకు అనుగుణంగా మన ఉత్పత్తులకు డిమాండ్ పెంచుకోవాలి. దేశీయంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నందున వాటిని ఎగుమతి చేయడం ద్వారా రైతులకు లబ్ది చేకూర్చాలి. ఒక్క అమెరికానే కాకుండా మిగా ప్రపంచం వైపు దృష్టి సారించాలి. వ్యవసాయరంగంలో విప్లవాత్మకనిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. స్వాతంత్ర్యం లభించి 78సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి



చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. మనరైతులనే ప్రోత్సహించి పంటల దిగుబడి పెంచుకోవాలి. పెరిగిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేలా విధానాలు రూపొందించాలి. రైతులను కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. వ్యవసాయభూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. మార్కెట్లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి. అలాగే పండిన పంటలను ఎగుమతులకు ప్రోత్సాహం ఇవ్వాలి. అప్పుడే మనకు కూడా విదేవీ మారకం పెరగగలదు.

# నేడు ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## నేడు కళ్యాణోత్సవానికి సిఎం చంద్రబాబు హాజరు



కడప్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ఒంటిమిట్టలో రమణీయంగా కోదండరామయ్య వార్షిక బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి.. ఐదవ రోజు ఉదయం మోహిని అలంకారంలో సీతారామ లక్ష్మణులు విహరించారు.. స్వామి అమ్మవార్లకు పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు పండితులు.. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో కోలాహలంగా జగదభి రామయ్య వాహన సేవ నిర్వహించారు.. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు.. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.. ఈ క్రమంలో శుక్రవారం ఒంటిమిట్ట కోదండ రాముని కళ్యాణోత్సవం జరగనుంది.. సాయంత్రం 6:30 నుంచి రాత్రి 9:30 మధ్య పండు వెన్నెలలో పౌర్ణమి రోజున రాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు.. సీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం చేసింది టీటీడీ.. భక్తులకు పంపిణీ చేయడానికి లక్ష ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్లు- సిద్ధం చేశారు..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడపకు రానున్నారు.. ఒంటిమిట్ట కోదండ రామాలయం కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు. ప్రభుత్వం తరపున రాములవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.. రాత్రికి ఒంటిమిట్టలోని స్ట్ హౌస్ లో బస చేయనున్నారు సీఎం చంద్రబాబు.. 12వ తేదీన తిరిగి కడప ఎయిర్పోర్ట్ నుంచి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు..కాగా, ఒంటిమిట్ట శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.. రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ రామనవమి, హనుమత్సేవ, ఈ రోజు గరుడసేవ, రేపు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు- వస్త్రాలతో పాటు- ముత్యాల తలంబ్రాలను స్వామివారికి సమర్పించనున్నారు. అనంతరం గజ వాహన సేవ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 12వ తేదీన రథోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 14వ తేదీన ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అలాగే, ఏప్రిల్ 15న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

# పవన్ కల్యాణ్ సీరియస్ పొలిటీషియన్ కాదు

**పవన్ కల్యాణ్ పై ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు..**

**ఆయన ఉపముఖ్యమంత్రి కావడం ఏపీ ప్రజల దురదృష్టమన్న కవిత**

**వైసీపీ తప్ప అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని విమర్శ**

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. దురదృష్టవశాత్తూ ఆయన ఏపీకి ఉపముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ఏపీలో వైసీపీతో మినహా అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. పవన్ నిజానికి సీరియస్ పొలిటీషియన్ కాదని, ఆయన వ్యాఖ్యలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ మేరకు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రజలు హిందీ నేర్చుకోవాలన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారని అడిగిన ప్రశ్నకు కవిత ఈ వ్యాఖ్యలు చేశారు.రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో



పూర్తిగా వామపక్ష భావజాలంతో కనిపించిన పవన్ కల్యాణ్.. ప్రస్తుతం బీజేపీతో అంటకాగుతున్నారని కవిత విమర్శించారు. పార్టీ పెట్టిన 15 ఏళ్లకు ఎమ్మెల్యేగా ఎన్నికై అనుకోకుండా ఉప ముఖ్యమంత్రి అయ్యారని, అది ఏపీ ప్రజల దురదృష్టమని అన్నారు. చెగువేరాను ఆదర్శంగా తీసుకున్నట్లు ప్రకటించిన పవన్ ప్రారంభంలో సీపీఐ, సీపీఎంతో పొత్తు పెట్టుకున్నారని గుర్తు చేశారు. ఆ తర్వాత లెఫ్ట్ భావజాలం విడిచి హిందుత్వం వైపు మొగ్గు చూపారని, బీజేపీతో పొత్తు పెట్టుకున్నాక ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చిందని అన్నారు. హిందుత్వం మీద ఆయనకు ఇప్పుడు అతిభక్తి పెరిగిపోయిందని పేర్కొన్నారు. ఆయన చేసే ప్రకటనల్లో ఒకదానికొకటి పొంతన ఉండదని ఎద్దేవా చేశారు. రేపు తమిళనాడుకు వెళ్లి హిందీ ఇంపోజ్ చేయబోమని చెప్పినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని ఎమ్మెల్సీ కవిత చెప్పారు.

# ఓదార్పులతో మళ్లీ జగన్ రాజకీయం

## రాజకీయ పటాటోపం ప్రదర్శించేలా కార్యక్రమం -పోలీసులను తిట్టి విమర్శలపాలు

అమరావతి ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బాగా ఇష్టమైన ఓదార్పు ఇప్పుడు మళ్లీ మొదలు పెట్టారు. కేవలం ఓదార్పుకే పరిమితం కాకుండా ఓదార్పు రాజకీయాలు చేపట్టారు. ఇటీవల కాలంలో ఆయన తన పటాటోపం చూపేందుకు ఓదార్పులను ఎంచుకున్నారు. రాజకీయంగా బలప్రదర్శన చేస్తున్నారు. అంతేగాకుండా పోలీసులను బట్టలూడదీసి కొడతానని అంటున్నారు. ఐదేళ్ల పాటు సిఎంగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడి పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసారు. గతంలో తన రాజకీయ ప్రస్థానంలో ఆయన ఓదార్పు యాత్రలతో ప్రజల వద్దకు వెళ్లేవారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరు ఆపదలో ఉన్నా వారికి ఓదార్పు దక్కడలేదు. అంగన్వాడీలు రెండునెలలుగా సమ్మెచేస్తున్నా కనీసం వారిని ఓదార్చలేదు. అలాగే అమరావతి రైతులను ఐదేళ్లుగా దూరం పెట్టారు. అమరావతి రైతుల నుంచే ఆయన ఓదార్పు మంత్రాన్ని పక్కన పెట్టారు. అప్పుడు ఎలాంటి విషయంలోనూ ఓదార్పును ప్రకటించడం లేదు. అలాగే ఎవరు ఎలాంటి ఆందోళనతో ఉన్నా అస్సలు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. పాదయాత్రతో అమరావతి ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకుని వెళ్లినా చడీచప్పుడు లేకుండా పోయింది. అంగన్వాడీలు, మున్సిపల్ సిబ్బంది, టీచర్ల ఆందోళన వంటి విషయాల్లో కూడా జగన్ ఏనాడు కూడా ఓదార్పు చేపట్టలేదు. అప్పుడు ఆందోళనలపై



ఎక్కడా స్పందించకుండా ఉన్నారు. ఆందోళన చేసిచేసిన అమరావతి రైతులకు కూడా నీరసం వచ్చేలా చేయడంలో జగగన్ విజయం సాధించారనే చెప్పాలి. మొత్తంగా ఐదేళ్లుగా రాజధాని అన్నది లేకుండా చేసుకున్న ఘనత జగన్కే దక్కుతుంది. ఇకపోతే సమస్య ఏదైనా ప్రజలు ఆందోళన చేస్తున్నా వారిని పలకరించి ఓదార్చ లేదు. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రతిరోజూ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలను కలిసి విజ్ఞప్తులు స్వీకరించేవారు. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఇందుకు పూర్తి భిన్నంగా పాలనా వ్యవహార శైలి సాగింది. తనకు నచ్చిన లేదా అవసరమైన అతి కొద్దిమంది వ్యక్తులను మినహా ఎవరినీ ఆయన కలవరన్న విమర్శలు ఉన్నాయి. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులతోపాటు ఇతర వర్గాల ప్రజలు ఆందోళన బాట పట్టినా జగన్మోహన్ రెడ్డి చలించ లేదు. వారిని కలసి ఓదార్చ లేదు. రైతులకు అపాయింట్మెంట్ ఇవ్వడానికి కూడా ఆయన ముందుకు రాలేదు. రైతులకు ఏమి కావాలో కనుక్కుని సమస్య పరిష్కరించండని కూడా చెప్పలేదు. వారిని పెయిడ్ ఆర్టిస్టులుగానే చూశారు. రాజధాని విషయమై ప్రజలలో గందరగోళం నెలకొన్నప్పటికీ ఈ విషయంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తాను పట్టిన రాజధానికి మూడు పట్టణాలు అన్న తీరులో కాలం గడిపారు. అధికారంలో లేనప్పుడు రాషట్రమంతా ఓదార్పు చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారు. మొత్తంగా సిఎం అయ్యాక జగన్ వైఖరి చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించమని ఆదేశాలు ఇచ్చారే తప్ప పిలిచి మాట్లాడాలని ఎక్కడా చెప్పలేదు. తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అనేకవర్గావారు మదనపడ్డ రోజులు చూశాం. ఇదంతా గతం. ఇప్పుడు మళ్లీ ఓదార్పులు అసవరం. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే నిలవాలి. గెలవాలంటే ప్రజలను ఓదార్చాలి. అందుకే రాష్ట్రాడు పర్యటనలో డ్రామాలకు తెరలేపారు. నానా హంగామా సృష్టించారు. ఓదార్పుగా కాకుండా తన రాజకీయ దర్పం ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై నోరు పారేసుకున్నారు. వారిని అనరాని భాషలో తిట్టారు. దీనికి ఓ మాజీ సిఎంగా సిగ్గుపడాలి. విమర్శలకు సమాధానం చెప్పాలి.

# మళ్లీ మనదే అధికారం





అమరావతి,ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేని సీఎం చంద్రబాబు నాయుడు.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ దుయ్యబట్టారు.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.. సమావేశానికి హాజరైన ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు దిశా నిర్దేశం చేశారు. మంచి చేశాం కాబట్టే ఇవాళ వైసీపీ నేతలు గర్వంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నారని నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైసీపీకి మొదటి బీజం కర్నూలు జిల్లా నల్లకాలువలోనే పడింది. కేవలం ఇచ్చిన మాటకోసం.. ఎందాకైనా వెళ్లామన్నారు. ఆ ప్రస్థానంలో వైసీపీ ఆవిర్భవించింది. బలమైన పార్టీగా ఎదిగింది. ఆరోజు నుంచి ఈరోజు వరకూ విలువలు, విశ్వసనీయతకు అర్థం చెప్పిన వైసీపీలో ఈ రెండింటిని చూసి తనతో పాటుగా అందరూ అడుగులో అడుగు వేశారన్నారు.. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మారు. ప్రతి ఇంటికీ తన మనుషులను చంద్రబాబు పంపాడు. కరపత్రాలు, బాండ్లు చంద్రబాబు పేరిట పంచారు. ప్రతి వర్గాన్నీ మోసం చేశారు. పదిశాతం ప్రజలు జగన్ చేశాడు కాబట్టి, చంద్రబాబుకూడా చేస్తాడని నమ్మారు కాబట్టే 50 శాతం నుంచి 40 శాతానికి వైసీపీ ఓటు షేరు తగ్గింది.. చంద్రబాబు వచ్చి 11 నెలలు అయిపోయింది. రెండు బడ్జెట్లు పెట్టిన చంద్రబాబు హామీలు నెరవేరుస్తాడని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నా... హామీలు అమలు చేయాలంటే భయం వేస్తుందంటూ చంద్రబాబు రాష్ట్రానికున్న అప్పులపై అబద్ధాలు చెప్తున్నారన్నారు. ఏపీ పాత బీహార్ లా తయారైందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆయన ఆరోపించారు.. వైసీపీ అన్నా.. వైసీపీ కార్యకర్త అన్నా కూడా చంద్రబాబుకు భయం. హామీల అమల్లో, పాలనలో ఘోరంగా ఆయన విఫలమయ్యారు. టీడీపీ కేడర్, నాయకులు ప్రజల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రజలకు దగ్గరకు వెళ్తే కచ్చితంగా నిలదీస్తారు. అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.. అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రతి గ్రామంలోనూ మద్యం షాపులు, బెల్టుషాపులు యథేచ్ఛగా వెలిశాయి. పేకాట క్లబ్బులు, ఇసుక, మట్టి, మైనింగ్ మాఫియాలు నడుస్తున్నాయి. వ్యవస్థలన్నీ పూర్తిగా నాశనం అయిపోయాయి. చంద్రబాబు పాలనలో ఆరు నెలలు తిరక్కముందే ప్రజలకు తోడుగా మనం నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది.. రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికలో వైసీపీ 10కి 9 చోట్ల గెలిచింది.. అక్కడ గెలవాల్సింది వైసీపీ అయితే అక్కడ ఎన్నికను తారుమారు చేయడానికి ప్రయత్నించారు. కోర్టు ఆదేశాలతో ఎంపీటీసీలకు భద్రత ఇవ్వాల్సింది పోయి, పోలీసులే ఎంపీటీసీలను బెదిరించే కార్యక్రమాలు చేశారు. రామగిరి ఎస్సై, ఎంపీటీసీల వాహనం ఎక్కాడు. వీడియో కాల్‌లో ఎమ్మెల్యేతోనూ, ఎమ్మెల్యే కుమారుడితోనూ టీడీపీకి అనుకూలంగా ఓటేయమని బెదిరించారు. వైసీపీ పార్టీ ఎంపీటీ-సీలు ఎన్నిక సమయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వేరే మండల కేంద్రానికి తీసుకెళ్లి బైండోవర్ చేసే కార్యక్రమం చేశారు. దీనికి వ్యతిరేకంగా ధర్నాచేస్తే పార్టీ జిల్లా అధ్యక్షురాలు మీద, ఇన్‌ఛార్జి మీద కేసులు పెట్టారు. దీని తర్వాత మన పార్టీ తరఫున యాక్టివ్‌గా ఉన్న లింగమయ్యను హత్యచేశారని ఆరోపించారు.. ఇంతలా దిగజారిపోవాల్సిన అవసరం ఉందా.. ఇలాంటి పరిస్థితుల మధ్య మనం యుద్ధం చేస్తున్నాం.. కష్టాలు అనేవి శాశ్వతంగా ఉండవు.. పార్టీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నిలబడాలి.. వైసీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది.. జగన్ 2. లో ప్రతి కార్యకర్తకు జగన్ భరోసాగా ఉంటాడని స్పష్టం చేశారు.. సమావేశానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, శిల్పా రవి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ సహా పలువురు నేతకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు..

# వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు
## టిడిపి కార్యకర్త కిరణ్ అరెస్ట్




గుంటూరు,ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):వైసీపీ అధినేత జగన్ భార్య వైఎస్ భారతిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా విజయవాడ ఇబ్రహీంపట్నం వద్ద కిరణ్ ను అదుపులోకి తీసుకున్నారు. భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కిరణ్ పై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. దీంతో, కిరణ్ పై టీడీపీ నేతలే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కిరణ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల గుడ్డలు ఊడదీస్తానంటూ రామగిరి పర్యటన సందర్భంగా జగన్ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, భారతి గురించి చేబ్రోలు కిరణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆ తర్వాత క్షమాపణ చెప్పారు. తన మాటలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించమని కోరుతున్నానని అన్నారు. ఎలాంటి దురుద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేయలేదని... క్షణికావేశంలో మాత్రమే చేశానని చెప్పారు.

**పోలీసులు అదుపులో మాజీ ఎంపి గోరంట్ల మాధవ్**

చేబ్రోలు కిరణ్‌ను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో మంగళగిరి నుంచి గుంటూరుకు తరలిస్తున్న సమయంలో గోరెంట్ల మాధవ్ పోలీసు వాహనాన్ని వెంబడిస్తూ, ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గోరంట్ల మాధవ్ చేయి చేసుకునే ప్రయత్నం, అలాగే ఎస్కార్ట్ వాహనాన్ని అడ్డగించడం వల్ల పోలీసుల విధులకు ఆటంకంగా భావిస్తూ ఆయనపై కేసు నమోదు చేసినట్లు- సమాచారం. ఈ ఘటనతో గుంటూరు జిల్లాలో కొంత ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎంపీ మాధవ్‌ను అరెస్ట్ చేయడం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ స్పందించారు. యూట్యూబ్ ఛానెల్ లో కిరణ్ మాజీ సిఎం భార్యపై అసభ్యకరంగా మాట్లాడాడని, దీంతో అతన్ని అరెస్టు చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో మొత్తం నాలుగు కేసులు కిరణ్ పై ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం అతడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి రజిని పై కూడా అసభ్యకరమైన పోస్టులు కిరణ్ పెట్టాడని, దానికి సంబంధించి కూడా కేసు నమోదైందని తెలిపారు. అయితే అతడిని ఆరెస్ట్ చేసి వాహనంలో తరలిస్తున్న సమయంలో గోరంట్ల మాధవ్ వెంబడించినట్లు సమాచారం ఉందని, ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని తెలిపారు.

# అంజనేయస్వామి కృపతో మార్క్ శంకర్ ఇంటికి వచ్చేశాడు: చిరంజీవి





హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):సింగపూర్ స్కూల్‌లోని తరగతి గదిలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ ఆరోగ్యంపై మెగాస్టార్ చిరంజీవి తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. గురువారం సింగపూర్‌లో చిరంజీవి మాట్లాడుతూ.. మా బిడ్డ మార్క్ శంకర్ ఇంటికొచ్చేశాడన్నారు. అయితే బాబు ఇంకా కోలుకావాల్సి ఉందని పేర్కొన్నారు.మా కులదైవం అంజనేయస్వామి దయతో.. కృపతో త్వరలోనే కోలుకొని పూర్తి ఆరోగ్యవంతుడు అవుతాడని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మళ్లీ మామూలుగా ఎప్పటిలాగే బాబు ఉంటాడన్నారు. శుక్రవారం..అంటే ఏప్రిల్ 11వ తేదీ హనుమన్ జయంతి అని ఈ సందర్భంగా చిరంజీవి గుర్తు చేశారు. ఆ స్వామి ఓ పెద్ద ప్రమాదం నుంచి, ఓ విషాదం నుంచి ఆ పసి బిడ్డని కాపాడి మాకు అండగా నిలిచాడని అన్నారు.మార్క్ శంకర్ కోలుకోవాలని.. వివిధ ప్రాంతాల్లోని పలు ఊళ్లలో.. ఆ బిడ్డ కోసం ప్రార్థనలు చేస్తున్నారని.. ఆశీస్సులు అందజేస్తున్నారని చెప్పారు. ఇలా తమ కుటు-ంబానికి అండగా నిలబడి.. వారందరికి నా తరఫున, తమ్ముడు పవన్ కల్యాణ్ తరఫున, మా కుటు-ంబం యావన్మంది తరఫున మీ అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నామని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. సింగపూర్‌లో పవన్ కుమారుడు మార్క్ శంకర్ చదువుతోన్న స్కూల్‌లో అగ్నిప్రమాదం చోటు- చేసుకుందంటూ సమాచారం అందింది. ఈ ప్రమాదంలో అతడికి కి కాళ్లు, చేతులకు గాయాలైనట్లు పవన్ కళ్యాణ్‌కు సమాచారం అందింది.దీంతో ఆయన సింగపూర్ వెళ్లాలని నిర్ణయించారు. ఆ క్రమంలో పెద్ద సోదరుడు చిరంజీవి దంపతులుతోపాటు- పవన్ కల్యాణ్ సింగపూర్ బయలుదేరి వెళ్లిన సంగతి తెలిసిందే.

# సాధికార కమిటీకి సర్కార్ నివేదిక

**కంచ గచ్చిబౌలిభూముల్లో సుప్రీంకోర్టు**
**సాధికారత కమిటీపరిశీలన**
**పర్యావరణ,అటవీశాఖ అధికారుల భేటీ**
**అవి సర్కార్ భూములే**
**రెవెన్యూ, అటవీ రికార్డుల్లోప్రభుత్వ భూమిగానేనమోదు**
**అటవీభూమిగా ఎప్పుడూ నోటిఫై**



హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు కేంద్ర సా ధికారిక కమిటీ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం లో పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు భేటీ అయ్యారు. ఈ సమావేశానికి సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, డీజీపీ జితేందర్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున కమిటీ
సభ్యులతో దాదాపు 3 గంటలపాటు చర్చించారు. 400 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులు, ప్రభుత్వ విధివిధానాలు, ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కమిటీకి నివేదిక సమర్పించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో గురువారం కమిటీ వరుస సమావేశాలు నిర్వహించింది.
ఉదయం భూములను సందర్శించిన కమిటీ క్షేత్రస్థాయిలో పరిస్థితులపై వివరాలను తెలుసుకున్న అనంతరం ఎంసీహెచ్ఆర్‌డీలో విద్యార్థి సంఘాల నేతలతో భేటీ అయి వివరాలు సేకరించింది. తాజ్‌కృష్ణ హోటల్‌లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ వ్యవహారంపై కమిటీకి నివేదిక ఇచ్చింది. అలాగే బిజెపి ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందన్‌రావు కూడా ఈ కమిటీని కలిసి తమ నివేదకను అందించారు. హెచ్‌సీయూ పాలకవర్గం భూముల అంశంపై సమగ్ర వివరాలు తీసుకుంది. టీజీఐఐసీ ఈ భూములను చదును చేపట్టిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందచేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు వచ్చారు. వీరు కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి సుప్రీంకోర్టుకు నివేదిక అందించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధ్యయనం చేసి ఆ కమిటీ సుప్రీంకోర్టుకు నివేదిక అందచేయనుంది.

**కంచ గచ్చిబౌలి భూములలో పర్యటన**

కంచ గచ్చిబౌలి భూములను గురువారం సాధికార కమిటీ పరిశీలించింది. కమిటీ ఛైర్మన్ సిద్ధాంత్ దాస్‌తో సహ ముగ్గురు ప్రతినిధులతో కూడిన బృందం ఉదయం 10 గంటల నుండి కంచ గచ్చిబౌలి భూముల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితులను ఆరాతీశారు. మాదాపూర్ డిసిపి వినీత్ బృందంతో పాటుగా బందోబస్తు నిర్వహించారు. అనంతరం సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి కూడా అక్కడకి చేరుకొని పరిస్థితులను సమీక్షించారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, అటవిశాఖ అధికారులు, సిబ్బంది బృందంతో పాటు యూనివర్సిటీ భూముల వివరాలను అందించారు. అక్కడే ఉన్న విద్యార్థులు ఎంపవర్ బృందంతో మాట్లాడే ప్రయత్నం చేసిన అధికారులు వారిని అడ్డుకున్నారు. హెచ్‌సియూ విద్యార్థులలో కొంతమందిని జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో కలిసే అవకాశం కల్పించడంతో ఐదుగురు విద్యార్థి సంఘాల నాయకులు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు వర్సిటీ భూములపై జరుగుతున్న వివాదం, విద్యార్థులు, ప్రతిపక్షాలు చేస్తున్న అభ్యంతరాలతోపాటు మరింత లోతుగా అధ్యయనం చేసి పూర్తి సమాచారాన్ని సేకరించి నివేదికను అందించేందుకు ఎంపవర్ కమిటీ సిద్ధమైంది.

# అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం..బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదు:కెటిఆర్

హైదరాబాద్ఏప్రిల్10(జర్నలిస్ట్ వార్త):
ఎస్ఆర్‌డిపి పథకం కింద హైదరాబాద్‌లో చేపట్టిన పనులు 16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఫలక్ నుమా ఆర్ఓబిని పట్టించుకునే పరిస్థితి లేదు అని ఆరోపించారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్ గూడా జైలుకు పంపే శ్రద్ద దాని ముందున్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంపై లేదని,శిల్పా లే అవుట్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి కలిపే రెండో లెవెల్ వంతెనది అదే దుస్థితి అని విమర్శించారు. శాస్త్రిపురం ఆర్ఓబి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని అన్నారు. పూర్తయినవాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్ చేశారు..కానీ నిర్మాణంలో ఉన్నవాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశాని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కమీషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా..? అని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ద నిర్మాణాల మీద లేదా..? అని నిలదీశారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని దుయ్యబట్టారు.

**బోడ బాజీ అమ్మకి నా వందనం : కెటిఆర్ బావోద్వేగం**

ఓ గిరిజన వృద్ధురాలు.. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకోవడం పట్ల కెటిఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. తనకు వచ్చిన రూ. 2 వేల పెన్షన్‌లో నుంచి రూ. వెయ్యి తన పెద్ద కొడుకు కెసిఆర్‌కు ఇవ్వాలని మాజీ ఎంపీ మాలోత్ కవితకు అందజేశారని చేశారని..ఇంత ఆప్యాయత, ప్రేమ తెలంగాణల కేవలం కెసిఆర్‌కే సొంతం అని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. కెసిఆర్ ఒక రాజకీయ నాయకుడు కాదు%%ఎంతో మందికి పెద్ద కొడుకు అని, తమ పార్టీని నడిపించే నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని ధారపోసిన దార్శనీకుడు అని వ్యాఖ్యానించారు. ఎన్ని ఢిల్లీ పార్టీలు ఉన్నా%%తెలంగాణ ఇంటి పార్టీ బిఆర్ఎస్ అని చెప్పారు. మాది పేగు బంధం%%బోడ బాజీ అమ్మకి నా వందనం అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.






# ఒలింపిక్స్‌లో క్రికెట్

ప్రపంచ క్రీడా సంబురమైన ఒలింపిక్స్‌లో ఎన్నో రకాల గేమ్స్ ఉన్నాయి. అయితే ఎంతో పాపులారిటీ, క్రేజ్ కలిగిన క్రికెట్ మాత్రం విశ్వక్రీడల్లో కనిపించదు. దీంతో ఒలింపిక్స్‌లో జెంటిల్మన్ గేమ్ ఉంటే అదిరిపోతుందని చాలా మంది స్పోర్ట్స్ లవర్స్ కోరుకున్నారు. ఎట్టకేలకు ఆ కల నెరవేరనుంది. లాస్ ఏంజిల్స్ ఆతిథ్యం ఇవ్వనున్న ఒలింపిక్స్-2028లో క్రికెట్‌ను చేరుస్తున్నారు. అయితే ఇక్కడే ఓ ట్విస్ట్ ఇచ్చింది అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐవోసీ). మెగా టోర్నమెంట్‌లో ఆడే జట్ల విషయంలో మెలిక పెట్టింది. మరి.. ఐవోసీ తాజా ప్రకటనలో ఏం చెప్పిందో ఇప్పుడు చూద్దాం.. 128 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. మెన్స్‌తో పాటు విమెన్స్ టీమ్స్ కూడా లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028లో పోటీపడనున్నాయి. ఇద్దరికీ వేర్వేరు ఈవెంట్స్ నిర్వహిస్తారు. అయితే కేవలం ఆరేసి జట్లు మాత్రమే పాల్గొంటాయని స్పష్టం చేసింది ఐవోసీ. పురుషుల ఈవెంట్స్‌లో 6 జట్లు, మహిళల ఈవెంట్స్‌లో 6 జట్లు మెడల్స్ కోసం పోటీపడతాయని క్లారిటీ ఇచ్చింది. మొత్తంగా ప్రతి ఈవెంట్‌లో 90 మంది చొప్పున ఆటగాళ్లు పాల్గొంటారని తెలిపింది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచులు నిర్వహిస్తామని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం పేర్కొంది.

## పాక్‌కు ఝలక్

ఒలింపిక్స్‌లో పాల్గొనే జట్లు, ఆటగాళ్లు, ఫార్మాట్ తదితర విషయాలపై క్లారిటీ ఇచ్చిన ఐవోసీ.. క్వాలిఫికేషన్ గురించి మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మెగా టోర్నమెంట్‌కు ఇంకా చాలా టైమ్ ఉంది. కాబట్టి ఆ వివరాలు తదుపరి వెల్లడించే అవకాశం ఉంది. అయితే టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నందున యూఎస్ఏ జట్టు ఎలాగూ నేరుగా అర్హత సాధిస్తుంది. దీంతో మిగిలిన 5 జట్లు ఏవో తేలాల్సి ఉంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో ఉన్న జట్లే క్వాలిఫై అవుతాయని వినిపిస్తోంది. అదే నిజమైతే 7వ ర్యాంక్‌లో ఉన్న దాయాది పాకిస్థాన్‌కు ఒలింపిక్స్ చాన్స్ మిస్ అవడం ఖాయం. కాగా, వచ్చే ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్ (సిక్సెస్), స్క్వాష్ లాంటి ఇతర ఆటల్ని కొత్తగా చేర్చారు.



# రషీద్ ఖాన్ నో లుక్ షాట్..

## యశస్వి జైస్వాల్ అద్భుతమైన క్యాచ్



ఐపీఎల్ 2025 23వ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో ఆల్‌రౌండర్ రషీద్ ఖాన్ తన వంతు పాత్ర పోషించాడు. 7వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రషీద్.. మొత్తంగా చివర్లో 4 బంతులు ఎదుర్కొని ఒక సిక్స్, ఒక ఫోర్‌తో 12 పరుగులు చేశాడు. ఆ రెండు బౌండరీలు అతడు రాయల్స్ బౌలర్ తుషార్ దేశ్‌పాండే ఓవర్‌లో కొట్టడం గమనార్హం. కానీ అదే ఓవర్ 6వ బంతికి రషీద్ ఓ చిత్రవిచిత్రమైన షాట్ కొట్టేందుకు ప్రయత్నించి.. ఊహించని విధంగా అవుట్ అయ్యాడు. రషీద్ నో లుక్ షాట్ అతడికి బౌండరీ తెచ్చిపెడుతుందని అనుకుంటే.. యశ్వసి జైస్వాల్ అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 217 పరుగులు చేయగా.. టార్గెట్ ఛేధించే క్రమంలో రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో గుజరాత్ టైటాన్స్ 58 పరుగుల భారీ తేడాతో విజయం సాధించడమే కాదు.. టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని అందుకుని పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచింది.

# ధోని విషయంలో అలాగే మాట్లాడతా..

## రాయుడు సంచలన వ్యాఖ్యలు

టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశాడు. సోషల్ మీడియా వేదికగా తన మీద వస్తున్న విమర్శలు, ట్రోలింగ్‌పై అతడు ఘాటుగా రియాక్ట్ అయ్యాడు. ఎవ్వరేం అనుకున్నా.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు, మహేంద్ర సింగ్ ధోనీకి తన మద్దతు ఇలాగే కొనసాగుతుందని అతడు స్పష్టం చేశాడు. ధోని విషయంలో తాను ఇలాగే మాట్లాడతానని క్లారిటీ ఇచ్చాడు. తాను మాహీకి ఫ్యాన్‌నని, ఇప్పుడు కూడా అభిమానం అలాగే ఉందని.. ఎప్పటికీ అతడికి ఫ్యాన్‌గానే ఉంటానని రాయుడు కుండబద్దలు కొట్టాడు.ధోనీకి మద్దతు విషయంలో తాను వెనక్కి తగ్గేది లేదన్నాడు రాయుడు. ఎవరేం అనుకుంటున్నారో తాను పట్టించుకోనని చెప్పుకొచ్చాడు. ఎవరేం అనుకున్నా తనకు పోయేదేం లేదని.. తాను 1 పర్సెంట్ కూడా పట్టించుకోనన్నాడు వెటరన్ బ్యాటర్. కాబట్టి తనపై ట్రోలింగ్ కోసం డబ్బులు ఖర్చులు చేయడం మానేయాలని.. దానికి బదులు ఆ డబ్బుల్ని అభాగ్యులకు ఇచ్చి సాయం చేయాలని సూచించాడు. కాగా, ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాడు రాయుడు. సీఎస్‌కేకు ఆడుతూ రిటైర్ అయ్యాడు. ఆ తర్వాత కూడా ఆ టీమ్‌కు, ధోనీకి ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటూ వచ్చాడు. అయితే సోషల్ మీడియా వేదికగా యాంటీ సీఎస్‌కే, యాంటీ ధోని ఫ్యాన్స్ రాయుడ్ని టార్గెట్ చేసుకొని ట్రోలింగ్‌కు దిగడం.. దానికి అతడు ఎప్పటికప్పుడు కౌంటర్ ఇవ్వడం లాంటివి ఈ సీజన్‌లో ఎక్కువయ్యాయి. ఈ క్రమంలోనే మరోమారు ట్రోలర్స్‌కు కౌంటర్ ఇచ్చాడు రాయుడు.



# ఆసియా ఛాంపియన్‌షిప్ సింధు ఔట్

## యమగుచి చేతిలో సింధు ఓటమి



2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పివి సింధుకు నిరాశ ఎదురైంది. తొలి మ్యాచ్‌లో నెగ్గిన సింధుకు హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. ఆమె జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో 12-21, 21-16, 16-21 తేడాతో ఓడింది. తాజా ఓటమితో సింధు ఆసియా ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. జపాన్‌కు చెందిన యమగుచితో సింధు గురువారం రెండో రౌండ్‌లో ఢీ కొట్టింది. ఈ మ్యాచ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి యమగుచి సింధుపై మొదటి సెట్‌లో భారీ తేడా 12-21తో నెగ్గింది. ఇక రెండో సెట్‌లో సింధు కమ్‌బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి సవాల్ విసురుతూ చురుగ్గా ఆడింది. ఫలితంగా రెండో సెట్‌ను సింధు 21-16తో దక్కించుకుంది. దీంతో ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. డూ ఆర్ డై సెట్‌లో సింధు ప్రత్యర్థికి గట్టిగానే బదులిచ్చింది. హోరాహోరీగా సాగిన ఈ సెట్‌లో సింధు ఆఖర్లో పట్టు కోల్పోయింది. చివర్లో యమగుచి 16-24 తేడాతో నెగ్గి మ్యాచ్ సొంతం చేసుకుంది. దీంతో సింధు టోర్నీ నుంచి నిష్క్రమించింది.



# ఢిల్లీ ఘన విజయం


ఆర్సీబీతో మ్యాచ్..
తాజా ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగోసారి జయకేతనం ఎగురవేసింది. చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన డీసీ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో, ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫిల్ సాల్ట్ (24 బంతుల్లో 37 పరుగులు), విరాట్ కోహ్లీ (19 బంతుల్లో 28 పరుగులు) మంచి ఆరంభాన్నే ఇచ్చినా వారి నిష్క్రమణతో ఆర్సీబీ పతనం ప్రారంభమైంది. మిడిల్ ఓవర్స్‌లో బ్యాట్స్‌మన్ తడబడటంతో ఆర్సీబీ ఓటమి ఖరారైంది. రజత్ పటీదార్ (25), కృనాల్ పాండ్య (18) ఓ మోస్తరు ప్రయత్నం చేశారు. ఢిల్లీ బౌలర్లలో విప్రాజ్ నిగమ్ 2, కుల్‌దీప్ యాదవ్ 2, ముఖేశ్ కుమార్, మోహిత్ శర్మ చెరో వికెట్ పడగొట్టారు.

%లక్ష్య ఛేదనలో డీసీ అదరగొట్టింది. 17.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించింది. 53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులతో విరుచుకుపడిన కేఎల్ రాహుల్ 93 పరుగులతో అజేయంగా నిలిచాడు. జట్టుకు విజయాన్ని అందించాడు. 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన స్టబ్స్ కూడా రాణించాడు. ఇన్నింగ్స్ మొదట్లో వరుసగా వికెట్లు పడటంతో ఢిల్లీ క్యాపిటల్స్ కూడా తడబడ్డారు. 89 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయి ఇబ్బందుల్లో పడ్డ సమయంలో రంగంలోకి దిగిన కేఎల్ రాహుల్ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. ఆర్సీబీ బౌలర్లు భువనేశ్వర్ కుమార్ రెండు, యశ్ దయాల్ సుయాశ్ శర్మ చెరో ఒక వికెట్ తీసుకున్నారు.



# కోహ్లీ అద్భుతం..

## ఐపీఎల్ చరిత్రలో కొత్త రికార్డు



భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో వెయ్యి బౌండరీలు సాధించిన తొలి ఆటగాడిగా గుర్తింపు సొంతం చేసుకున్నాడు. డీసీతో ప్రస్తుతం బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రెండు బౌండరీలు సాధించి ఈ రికార్డు నెలకొల్పాడు. 920 బౌండరీలతో శిఖర్ ధవన్ రెండో స్థానంలో నిలవగా 899 ఐపీఎల్ బౌండరీలు బాదిన డేవిడ్ వార్నర్ మూడో స్థానంలో నిలిచాడు. ఇక ఐపీఎల్‌లో 8 వేల పైచిలుకు పరుగులు చేసిన విరాట్ టాప్ స్కోరర్లలో ఒకడిగా నిలిచిన విషయం తెలిసిందికాగా, తాజాగా జరుగుతున్న మ్యాచులో ఆర్సీబీ అభిమానులను నిరాశే ఎదురైంది. ఢిల్లీ పేసర్ల ధాటికి ఆర్సీబీ తొలి ఒవర్లలోనే ఏకంగా మూడు వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికి ఆర్సీబీ స్కోరు 64గా నిలిచింది. అయితే, దూడుకుగా ఆడేందుకు ప్రయత్నించిన కోహ్లీ విప్రోజ్ నిగమ్ వేసిన ఏడో ఓవర్‌లో చివరి బంతికి షాట్ కొట్టబోయి స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చాడు. మొదట్లో ఫిల్ సాల్ట్ దూకుడుగా ఆడినా 37 రనౌట్ కావడం ఆర్సీబీకి అతిపెద్ద షాక్‌గా చెప్పొచ్చు.

## 'విశ్వంభర' నుంచి మెగా అప్‌డేట్..
# ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్!




మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'విశ్వంభర'. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రం యూనిట్ ప్రకటించింది. 'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా బాల హనుమాన్‌లతో చిరు ఉన్న కొత్త పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు.

యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి బాణీలు అందిస్తున్నారు. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. ఇక గతేడాది దసరా కానుకగా 'విశ్వంభర' టీజర్ విడుదల కాగా... మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. త్వరలో విడుదల తేదీని కూడా ప్రకటిస్తారని సమాచారం.



# కలెక్టర్ అవ్వాలనుకున్నా

డాక్టర్ కాబోయ్ యాక్టర్లు అయిన వాళ్లు చాలా మంది ఉన్నారు. కొంత మంది డాక్టర్లు అయి యాక్టర్ అయితే? మరికొంత మంది యాక్టర్లు అయిన తర్వాత డాక్టర్లు అయ్యారు. హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టుల లిస్ట్ తీస్తే చాలా పెద్దదే ఉంటుంది. సాధారణంగా హీరోయిన్లు అంటే మోడలింగ్ నుంచే ఎక్కువగా వస్తుంటారు. కానీ ఇప్పుడు మోడలింగ్ తో పనిలేకుండానే హీరోయిన్లగా మారిపోతున్నారు. సోషల్ మీడియాలో అందుబాటులోకి వచ్చిన తర్వాత అందులో ఇన్ ఫ్లూయోన్సర్ గా మారితే చాలు డైరెక్టర్ కి నచ్చితే పిలిచి హీరోయిన్ చేస్తున్నారు. ఒక్క సినిమా హిట్ వాళ్ల జీవితాన్నే మార్చేస్తుంది. తాజాగా కలెక్టర్ కాబోయ్ హీరోయిన్ అయిందన్న విషయంలో రాశీఖన్నా విషయంలో మాత్రం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'ఊహలు గుస గుసలాడే' చిత్రంతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు కొన్నాళ్ల పాటు తిరుగు లేకుండా అవకాశాలు బాగానే అందకుంది. వాటిలో సక్సెస్ లు చూస్తే పెద్దగా కనిపించవు. రాశీ గొప్ప పెర్ఫార్మర్ కాదు. కానీ అందం.. అభినయంతోనే రాశీకి ఇండస్ట్రీ అవకాశాలిచ్చింది. కానీ ఆ ఛాన్సులను సక్సెస్ లుగా మార్చుకోలేక పోయింది. దీంతో కోలీవుడ్ కి టర్నింగ్ తీసుకుంది. అక్కడ నుంచి ఇప్పుడు బాలీవుడ్ లో కొనసాగుతుంది. ప్రస్తుతం కోలీవుడ్ ...బాలీవుడ్ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేస్తోంది. అయితే డాక్టర్ వృత్తిపై మక్కువతో సినిమాను తాను చాలా చులకనగా చూసినట్లు తెలిపింది.ఐఏఎస్ అవ్వాలని కలలుకన్నాను. బాగా చదివాను. ఈ క్రమంలోనే నటన అంటే అభద్రతా భావాన్ని ఏర్పరుచుకున్నాను. నటనను చాలా చిన్నగా చూసాను. ఎవరూ సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీకి వస్తే ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. చూసే విధానం వేరుగా ఉంటుంది. అందుకే అలా భావించానమో. కానీ ఇదంతా తప్పు అని తర్వాత తెలుసుకున్నాను. ఎన్ని సవాళ్లు ఎదుర్కుంటే? అంతగా రాటు దేలుతాం. ఆ అనుభవం జీవితంలో పైకి ఎదగడానికి ఎంతో దోహద పడుతుందని తెలిపింది.



కుంచకో బోబన్.

# ఆ కారణంతో ఇండస్ట్రీలోకి రాకూడదనుకున్నా

ఇటీవల రిలీజై ఆడియన్స్ ను మెప్పించిన మలయాళ మూవీ ఆఫీసర్ ఆన్ డ్యూటీ. ఆ సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చి మంచి హిట్ అందుకున్నారు మలయాళ నటుడు కుంచకో బోబన్. రీసెంట్ గా ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని అందులో తన కెరీర్ గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. యాక్టర్ గా ఇండస్ట్రీలో కుటుంబ వారసత్వాన్ని కంటిన్యూ చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్తున్న కుంచకో బోబన్, తమ ఫ్యామిలీ 1949 నుంచి సినీ రంగంలో రాణిస్తోందని, కేరళలో మొదటి స్టూడియో ఏర్పాటు చేసిన వ్యక్తి తన తాతయ్యేనని, తన తండ్రి కూడా చైల్డ్ ఆర్టిస్టుగా, డైరెక్టర్ గా, ప్రొడ్యూసర్‌గా ఎన్నో సినిమాలు చేశారని ఆయన తెలిపారు. వరుస ఫ్లాపుల వల్ల తమ కుటుంబం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందని, ఫైనాన్షియల్ సమస్యల వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని, దాంతో తనకు సినీ ఇండస్ట్రీపై అసహ్యం వచ్చిందని, తమకు వచ్చిన ప్రాబ్లమ్స్ అన్నింటికీనీ ఇండస్ట్రీనే కారణమనుకుని పరిశ్రమను నిందించేవాడినని, ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలని ఎప్పుడూ అనుకోలేదని ఆయన తెలిపారు. తాను ఒకటి అనుకుంటే విధి మరోలా రాసిందని, యాక్టర్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి కెరీర్లో ఎన్నో లవ్, ఫ్యామిలీ సినిమాలు చేసి ఆడియన్స్ ఆదరాభిమానాలు సొంతం చేసుకున్నట్టు కుంచకో తెలిపారు. ఇక ఆఫీసన్ ఆన్ డ్యూటీ సినిమా గురించి మాట్లాడుతూ ఆ సినిమా తనకెంతో స్పెషల్ అని, ఆ సినిమాలో పోలీసాఫీసర్ గా నటించడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని ఆయన వెల్లడించారు. కరీర్ స్టార్టింగ్ లో తాను కేవలం లవ్ ఎంటర్టైనర్స్ మాత్రమే చేయడం వల్ల అలాంటి సినిమాల్లోనే యాక్ట్ చేస్తాననుకున్నారని, దాంతో చేసేదేం లేక కెరీర్ నుంచి కొంత కాలం బ్రేక్ తీసుకుని, ఆ తర్వాత డిఫరెంట్ రోల్స్ సెలెక్ట్ చేసుకుంటూ ముందుకెళ్లినట్టు ఆయన తెలిపారు. తన కెరీర్లో మొదటిగా స్కూల్ బస్ సినిమా కోసం పోలీస్ పాత్రలో నటించానని ఆ సినిమా తనకు మంచి పేరుని తెచ్చిపెట్టిందని కుంచకో బోబన్ తెలిపారు.



# సంపూర్ణేశ్ 'సోదరా'
## ఈ నెల 25వ తేదీన విడుదల

చూడటానికి సంపూర్ణేశ్ బాబు చాలా సింపుల్ గా కనిపిస్తాడు. కానీ తెరపైకి వస్తే ఆయనను పట్టుకోవడం చాలా కష్టం. కమెడియన్ గా .. కామెడీ హీరోగా మంచి క్రేజ్ ఉన్నప్పటికీ తన సొంత ఊర్లో ఎప్పటిలా గడపడానికే ఆయన ప్రాధాన్యతనిస్తూ ఉంటాడు. చకచకా సినిమాలు చేసేసి గబగబా నాలుగు రాళ్లు సంపాదించాలనే ఆరాటం .. ఆత్రుత ఆయనలో మనకి కనిపించదు. అలాంటి సంపూకి 'కొబ్బరిమట్ట' తరువాత హిట్ పడలేదనే చెప్పాలి. సాధారణంగా హీరోగా ఒకటి రెండు ఫ్లాపులు పడగానే, ఎవరైనా సరే కంగారుపడిపోయి కమెడియన్ గా వెనక్కి వచ్చేయడానికి ప్రయత్నం చేస్తారు. అలాంటి ఒక ఆదుర్దా కూడా మనకి సంపూలో కనిపించదు. అలాంటి సంపూకి ఈ మధ్య కాస్త గ్యాప్ వచ్చింది. అనుకున్న సినిమాలు ప్రమోషన్స్ స్థాయిలో ఆగిపోవడమే అందుకు కారణమని సంపూ నిజాయితీగా చెబుతూ వెళుతున్నాడు. అలాంటి ఆయన తాజా చిత్రంగా ప్రేక్షకులను పలకరించడానికి 'సోదరా' సినిమా సిద్ధమవుతోంది. ఈ నెల 25వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది. అన్నదమ్ముల ఎమోషన్స్ చుట్టూ తిరిగే కథ ఇది. ఇంతవరకూ సంపూ సినిమాలన్నీ కూడా టైటిల్ దగ్గర నుంచే కామెడీని టచ్ చేస్తూ వచ్చాయి. కానీ అందుకు భిన్నంగా ఈ సారి ఆయన 'సోదరా' అనే ఒక సాదాసీదా టైటిల్ తో .. తన ఇమేజ్ కి భిన్నమైన ఎమోషన్స్ వైపు నుంచి వస్తున్నాడు. ఈ సినిమాతో సంపూ హవా మళ్లీ జోరందుకుంటుందేమో చూడాలి మరి.

## యాంకర్ ప్రదీప్ కొత్త సినిమా టికెట్ లాంచ్ చేసిన రామ్ చరణ్




ప్రముఖ నటుడు రామ్ చరణ్ తాజాగా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రానికి సంబంధించిన బిగ్ టికెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో పంచుకుంది.యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా రూపొందిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సినిమా బిగ్ టికెట్ ఆవిష్కరణ కార్యక్రమానికి రామ్ చరణ్ హాజరుకావడం పట్ల చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

# ఎవరీ సాయి అభ్యంకర్.. ?
## అల్లు అర్జున్, అట్లీ మ్యూజిక్

ఇండస్ట్రీలో ఒక్క ఛాన్స్ వల్ల జీవితమే మారిపోతుంది. అలాంటి అదృష్టం కలిసొచ్చింది 20 ఏళ్ల యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్‌కు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్‌కి మ్యూజిక్ ఇవ్వనున్నాడని బలమైన టాక్ వినిపిస్తోంది. అఫీషియల్ క్లారిటీ రాకపోయినా అట్లీ మనసు మొత్తం అతనిపైనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక AA22 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ పాన్ వరల్డ్ సినిమా బడ్జెట్ దాదాపు రూ.600 కోట్ల దాకా ఉండొచ్చని టాక్.

అలాంటి ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు ఒక్క సినిమా కూడా పూర్తి చేయని సాయి అభ్యంకర్‌కు అవకాశం వస్తుండడం నిజంగా సెన్సేషనల్. ఈ యువకుడి గురించి గూగుల్‌లో వెతికితే బహుశా ఒక్క సినిమా వివరాలు కూడా కనిపించకపోవచ్చు. కానీ యూట్యూబ్‌లో మాత్రం మ్యూజిక్ సింగిల్స్ రూపంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు. 2024లో విడుదలైన 'కట్చి సేరి' అనే తమిళ మ్యూజిక్ వీడియోకి సాయి కంపోజ్ చేసిన ట్యూన్ 220 మిలియన్ వ్యూస్ దాటింది.ఆ తర్వాత వచ్చిన 'ఆశ' అనే సాంగ్ అయితే 245 మిలియన్ వ్యూస్ సాధించింది. అదే సమయంలో మీనాక్షి చౌదరి నటించిన 'సితిరా పుతిరి' అనే మ్యూజిక్ సింగిల్‌కి కూడా మ్యూజిక్ సాయి అభ్యంకర్‌దే. సాయి అభ్యంకర్‌కి సంగీతం పట్ల ఆసక్తి చిన్నప్పటి నుంచే ఉంది. ఎందుకంటే అతడి తండ్రి టిప్పు ప్లేబ్యాక్ సింగర్.

చిరుత (యమహా యమ్మ), జులాయి(చక్కని బైక్ ఉంది), నువ్వు నాకు నచ్చావ్ (ఉన్నమాట చెప్పనీవు) వంటి చిత్రాల్లో టిప్పు పాడిన పాటలు మాస్ లో బాగా హిట్ అయ్యాయి. అలాగే సాయి తల్లి హరిణి కూడా సీనియర్ సింగర్. మణిశర్మ, రెహమాన్ నుంచి తమన్, దేవిశ్రీ ప్రసాద్ వరకు టాప్ మ్యూజిక్ డైరెక్టర్లతో పాటలు పాడిన ఆమె పేరు కూడా గుర్తుండిపోయేలా ఉంది. అలాంటి సంగీత కుటుంబంలో పుట్టిన సాయి అభ్యంకర్‌కు టాలెంట్ వారసత్వంగా వచ్చింది. అయితే బ్యాగ్రౌండ్ ఉన్నప్పటికీ ఒక్క పాట కూడా సినిమా రేంజ్‌లో రిలీజ్ కాకముందే అల్లు అర్జున్, అట్లీ లాంటి ప్రాజెక్ట్‌లలో ఛాన్స్ రావడం వెనక అతని వర్క్ మీద నమ్మకమే అసలు కారణం. ఇప్పటివరకు అనిరుధ్ రవిచందర్ దగ్గర బీజీఎం అసిస్టెంట్‌గా పని చేసిన సాయి.. దేవర, కూలీ వంటి చిత్రాలకు బ్యాక్గ్రౌండ్ స్కోర్‌లో వర్క్ చేశాడు. ఈ అనుభవమే అతనికి నెట్‌వర్క్‌ను తెచ్చిపెట్టింది. టెక్నికల్ నాలెడ్జ్‌లో అతని పట్టు ఉన్నందునే అతడిని భారీ బడ్జెట్ AA22 సినిమాకు ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

లేటెస్ట్ గా అందిన సమాచారం ప్రకారం, ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా లారెన్స్ హీరోగా వస్తున్న 'బెంజ్' సినిమాకు కూడా సాయి అభ్యంకర్‌నే సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. అంతేకాదు సూర్య, ఆర్జే బాలాజీ కాంబోలో రూపొందే సినిమాతో పాటు ప్రదీప్ రంగనాథన్ మమితా బైజు సినిమా కూడా అతడి ఖాతాలో ఉంది. ఇంకా చిన్న వయసులోనే ఇన్ని ప్రాజెక్టులు అగ్ర దర్శకుల చేతిలో రావడం అనేది ఎంత పెద్ద అవకాశం అనేది



చెప్పాల్సిన అవసరం లేదు.మొత్తంగా చెప్పాలంటే, సంగీత దర్శకుడిగా ఇండస్ట్రీకి ఒక్క అడుగు కూడా పెట్టకముందే ఈ స్థాయిలో ఛాన్సులు దక్కించుకోవడం అసాధారణం. అందులో %ూూ%22 లాంటి భారీ ప్రాజెక్ట్‌తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం అంటే సాయి అభ్యంకర్ మీద ఉన్న నమ్మకం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. ఇప్పుడు ఈ యువ సంగీత దర్శకుడు ఇంతటి అంచనాలను ఎలా నెరవేర్చుతాడో చూడాలి.